# జనబలం

ప్రజలే ప్రభువులు

జూలై 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## బీజేపీ విజయాలను భారతదేశ విజయాలుగా మార్చాలి : జేపీ





## ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికే పరిష్కారం





## పోలవరంపై శ్వేతపత్రం ప్రకటించండి





## వలసకాలపు ఆందోళనా పద్ధతులు



## దిగజారుడు బహిరంగ చర్చలు








# ప్రభుత్వం చేయాల్సిన పనులపై అవగాహన లేని మేడిన్ ఇండియా సోషలిజం ప్రమాదకరం: జేపీ

భారత్‌లో విజయవంతమైన తొలి తరం ఎంటర్‌ప్రెన్యూర్, పార్టీలకతీతంగా దేశంలో సోషలిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సి.పి సింగ్ మొదటి స్మారకోపన్యాస కార్యక్రమం ముంబయిలో జరిగింది. 'నేటి భారతంలో సోషలిజం ప్రాసంగికత' అంశంపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కీలకోపన్యాసం చేశారు. మన దేశంలో సోషలిజం అంటే నినాదం తప్ప నిర్వచనం లేని భావజాలం అని జేపీ అన్నారు. ప్రపంచంలో ఏ సోషలిస్టు దేశంలోనూ లేనిరీతిలో అగమ్యగోచరమైన సోషలిజాన్ని మన వద్ద వ్యాప్తి చేశారన్నారు. కుహనా సోషలిజాన్ని భారత్ మీద రుద్ది బహిరంగ చర్చను దిగజార్చి, రాజకీయ, పాలనా ఎజెండాను పక్కదోవ పట్టించారన్నారు. దీనివల్ల దేశం ఆర్థికంగా భ్రష్టుపట్టి పేదరికం విపరీతంగా కొనసాగిందన్నారు. సోషలిజం అంటే ఏంటో స్పష్టమైన నిర్వచనం అవసరమన్నారు. సోషలిజం అంటే.. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు అయితే తాను నూటికి నూరు శాతం సోషలిజాన్ని సమర్థిస్తానన్నారు. అలా కాకుండా సమసమాజం పేరుతో గుడ్డి ఆదర్శాన్ని నినాదంగా మార్చి తిప్పుతూ, కొందరు గెలవటానికి కొందరు నష్టపోవాల్సిందే అనే జీరో సమ్ రాజకీయం చేస్తూ ఒకరి వేళ్లతో ఇంకొకరి కళ్లు పొడుస్తుంటే ఆ సోషలిజాన్ని తాను తిరస్కరిస్తానన్నారు. 1991 తర్వాత విధిలేని పరిస్థితుల్లో కుహనా సోషలిజం నుండి బయటపడి సంస్కరణల బాట పట్టామని, కానీ ఇంకా పాత వాసనలు పోలేదన్నారు. ఆర్థిక భారం లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, మౌలిక వసతులు వంటివి తన మౌలిక బాధ్యతలని ప్రభుత్వం గుర్తించాలని, రాజ్యం ఇలా తన పాత్రను సవ్యంగా, సమర్థవంతంగా చేస్తే నిజమైన సోషలిజం ఫలితాలు ప్రజలకు అందుతాయన్నారు. సి.పి సింగ్ జాతీయోద్యమ తరానికి చెందిన వ్యక్తి అని, ఎమర్జెన్సీ లాంటి పరిణామాల పట్ల ఆగ్రహంతో సమాజహితం కోసం ఎంతో వ్యక్తిగత నిజాయతీతో, సంస్థాగత సామర్థ్యంతో పనిచేశారని నివాళులర్పించారు. అనవసరమైన పనుల్ని నెత్తినేసుకుని ఏదో చేస్తున్నట్లు ప్రజలను మభ్యపెడుతున్న రాజ్యం చేత తాను చేయాల్సిన అసలైన పనుల్ని చేయించటం ఇప్పుడు భారత్ ముందున్న వాస్తవ సవాలు అని జేపీ అన్నారు. మహారాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మాజీ సహాయ మంత్రి చంద్రకాంత్ త్రిపాఠి కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, రాజ్యసభ మాజీ ఎంపీ, పీఎంఓలో అటల్ బిహారీ వాజ్‌పేయికి సహాయకుడిగా పనిచేసిన సుధీంద్ర కులకర్ణి కూడా కీలకోపన్యాసం చేశారు. ముంబయి విశ్వవిద్యాలయం సివిక్స్ అండ్ పాలిటిక్స్ విభాగంతో కలిసి ఖానా చాహియే ఫౌండేషన్, భారత్ ఉత్థాన్ సంఘ్ చైర్మన్, ఆర్‌కేఎస్ అసోసియేట్ మేనేజింగ్ పార్టనర్ రాకేష్ కుమార్ సింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహారాష్ట్రలోని లోక్‌సత్తా సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 25 | 07 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| జూలై 2022 | | శిరమని నరేష్ | సోమసుందర్ |


## జనబలం చందా రుసుము వివరాలు


| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |


*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్



ఉడత: ఇది తన బలంతో విద్యుత్ వైర్లను సైతం తెంపివేయును.. కోతి: అది కోర్టులోని సాక్ష్యాలతో ఆడుకొనును.. తేనెటీగ: అది మంటను రాజేసి రథాలను సైతం భస్మం చేయును..!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

# బాల్యారిష్టాలు దాటని ఐదేళ్ల జీఎస్టీ

సంపాదకీయం

పరోక్ష పన్నుల వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణగా పేరుపొందిన జీఎస్టీ అమలులోకి వచ్చి జూలై 1వ తేదీ నాటికి సరిగ్గా ఐదేళ్లు పూర్తయ్యింది. జీఎస్టీ ప్రారంభాన్ని ఒక మహోత్సవంగా జరపాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం 2017 జూన్ 30వ తేదీ అర్ధరాత్రి పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశాన్ని నిర్వహించింది. వలసపాలన నాటి పన్నుల వ్యవస్థ స్థానంలో కొత్త పన్నుల వ్యవస్థ రావడం ఆర్థిక విప్లవమని, 'ఒకే దేశం-ఒకే పన్ను - ఒకే మార్కెట్' నినాదం అమల్లోకి రావడంతో ఏకీకృత పన్నుల వ్యవస్థ ఏర్పడుతుందని అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. పన్నుల విధానంలోని సంక్లిష్టతలను తొలగించడం, పన్నుల విధింపు వసూళ్లు, వివాద పరిష్కారమూ సరళతరం చేయడం, అధిక పన్నుల భారాన్ని అదుపు చేయడం, పన్నుల ఎగవేతనూ, వసూళ్ల యంత్రాంగంలోని పెత్తందారీతనాన్నీ, అవినీతినీ కట్టడి చేయడం, పన్నుల వ్యవస్థను పారదర్శకం చేయడం జీఎస్టీ లక్ష్యాలుగా పేర్కొన్నారు.

వస్తువుల తయారీపై, అమ్మకాలపై, సేవలు అందించడంపై, వివిధ దశల్లో వేర్వేరు రూపాల్లో వసూలు చేస్తున్న పన్నుల స్థానంలో వస్తు, సేవల సరఫరాపై పన్ను విధించడం జీఎస్టీలోని కీలకాంశం. గతంలో తయారీపై విధించే పన్నును ప్రస్తుతం వినియోగంపై విధించారు.

గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్న సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీసు ట్యాక్స్, సెస్సులు, సర్‌ఛార్జీలు, వ్యాట్, సేల్స్‌ట్యాక్స్, కొనుగోలు పన్ను, ఎంట్రీ ట్యాక్స్, వినోద, విలాస పన్నులు, ప్రకటనల పన్ను, స్టేట్ సెస్సులు, సర్‌ఛార్జీలు, ఆక్ట్రాయ్ పన్నులన్నీ జీఎస్టీలో కలగలిసి పోయాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పన్నును వసూలు చేస్తాయి. పన్నుల ఆదాయం పంపిణీ కోసం ఒక పద్ధతిని రూపొందించారు. పన్నుల రిటర్నుల దాఖలు, వే బిల్లులు, ఇన్‌వాయిస్‌ల జారీ వంటివన్నీ ఆన్‌లైన్‌లోనే జరపడానికి జీఎస్టీ పోర్టల్‌ను ఏర్పాటు చేశారు.

జీఎస్టీ ఆలోచనను అమలులోకి తెచ్చేందుకు సుదీర్ఘమైన కసరత్తు జరిగింది. విశ్వనాథప్రతాప్‌సింగ్ హయాంలో మొదలైన పన్నుల సంస్కరణల ప్రయత్నాలను పీవీ, మన్మోహన్ ద్వయం ముమ్మరం చేశారు. అటల్‌బిహారీ వాజ్‌పాయ్ హయాంలో ప్రభుత్వ ఆర్థిక సలహాదారులతో సంప్రదింపుల ఫలితంగా పశ్చిమబెంగాల్ ఆర్థికమంత్రి అషిమ్‌దాస్ గుప్తా సారథ్యంలో ఒక కమిటీ ఏర్పాటయ్యింది. అలాగే విజయ్ కేల్కర్ సారథ్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పడింది. అషిమ్‌దాస్ గుప్తా కమిటీ చేసిన సిఫార్సుల మేరకు జీఎస్టీ నమూనా రూపొందింది.

2006 ఫిబ్రవరి 28న బడ్జెట్ ప్రసంగంలో నాటి ఆర్థిక మంత్రి పి. చిదంబరం జీఎస్టీని ప్రవేశపెట్టబోతున్నట్టు తొలిసారిగా ప్రకటించారు. లోక్‌సభ, రాజ్యసభ, సెలెక్ట్ కమిటీ వేదికల్లో వివరమైన చర్చల తర్వాత జీఎస్టీ బిల్లు రూపొందింది. అయితే ప్రతిపాదిత బిల్లు వల్ల రాష్ట్రాల పన్నుల ఆదాయం తగ్గిపోతుందన్న వాదనతో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ బిల్లును గట్టిగా వ్యతిరేకించారు. అయితే నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన తర్వాతనే జీఎస్టీ బిల్లుకు మోక్షం లభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న జీఎస్టీ వల్ల పేదలపై పన్నుల భారం పెరుగుతుందని, ఎక్కువ స్లాబుల బదులు ఒకటే స్లాబు ఉంచి తక్కువ రేటుతో జీఎస్టీని సరళం చేయాలని, రిటర్నుల దాఖలు, ఫైలింగు ప్రక్రియను మరింత సులభం చేయాలని, రాష్ట్రాల వాటా పరిహారం చెల్లింపులు, ఇన్‌పుట్ క్రెడిట్ చెల్లింపులు వేగవంతం చేయాలని చర్చల దశలోనే డిమాండ్లు వచ్చాయి.

ఐదేళ్ల జీఎస్టీ అమలును పరిశీలిస్తే మొత్తం వ్యవహారం ఇంకా బాల్యారిష్టాలను దాటలేదని అవగతం అవుతుంది. పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 1కోటీ 30 లక్షలకు పెరిగింది. 2021 జూన్‌లో 92,800 కోట్ల రూపాయలున్న వసూళ్లు 2022 జూన్ నెలలో 1,44,616 కోట్లకు చేరాయి.

కానీ జీడీపీ 3శాతం పెరుగుతుందని వేసిన అంచనా నెరవేరలేదు. నోట్లరద్దు, కరోనా లాక్‌డౌన్‌ల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులున్నాయని చెప్పినప్పటికీ జీఎస్టీ పుట్టుకలో వచ్చిన లోపాలను సవరించే ప్రయత్నం చేయకపోవడం ఒక ప్రధాన కారణం. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు భారతదేశంలో జీఎస్టీ అమలు అస్తవ్యస్తంగా ఉన్నట్లు పేర్కొన్నాయి. ఒకటే స్లాబు, తక్కువ పన్ను రేటు అనే కీలకాంశాన్ని భారత్ పట్టించుకోలేదని వ్యాఖ్యానించాయి. ఇప్పటికే 0.25 శాతం నుండి 28 శాతం వరకూ ఏడెనిమిది రకాల స్లాబులు అమల్లో ఉండటం చూస్తే జీఎస్టీ లక్ష్యం పక్కదారి పట్టిందని అర్థం అవుతోంది. ప్రపంచంలో జీఎస్టీ అమల్లో ఉన్న 140 దేశాలలో అత్యధిక పన్ను స్లాబు 28శాతంగా ఉన్నది భారత్‌లో మాత్రమే. ఆహారపదార్థాలు, పప్పుధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, మద్యం వంటి వస్తువులను జీఎస్టీ పరిధికి బైట ఉంచారు. బంగారం, వజ్రాలు, విలువైన రాళ్లు వంటి వాటిని వేర్వేరు స్లాబుల్లో ఉంచారు.

ఇక అమల్లో ఉన్న చిక్కులకు పరిష్కారం రావడం లేదు. ఫైలింగు ప్రక్రియ ఇంకా సంక్లిష్టంగానే ఉన్నది. ప్రతి నెల, మూడు నెలలకు, ఆర్నెల్లకూ, ఏడాదికి రిటర్నులు దాఖలు చేసే ప్రక్రియ చాలా భారంగా మారింది.

రాష్ట్రాల ఆదాయం 14 శాతం వృద్ధి చెందుతుందని కేంద్రం నమ్మకంగా చెప్పింది. కానీ గత ఐదేళ్ల అనుభవం చూస్తే రాష్ట్రాల పన్నుల వాటా పడిపోయింది. రాష్ట్రాల వాటాలను చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒకప్పుడు ఇదే అంశంపై నరేంద్రమోదీ జీఎస్టీని వ్యతిరేకించిన సంగతి గుర్తు చేసుకోవాలి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని పలు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు అంటున్నారు. కౌన్సిల్ ఓటింగ్ విధానం కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉండటం వల్లనే తమ ప్రతిపాదనలు చెల్లుబాటు కావడం లేదని అంటున్నారు.

రిఫండ్ విధానం ఒక పీడకలగా మారిందనీ, రిటర్ను దాఖలు చేశాక తప్పులుంటే సవరించుకునే అవకాశం లేదనీ, వివాద పరిష్కారానికి ట్రిబ్యునల్స్ లేకపోవడం వల్ల అధికార యంత్రాంగపు పెత్తనం కొనసాగుతోందనీ పలువురు పన్ను చెల్లింపుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత ఐదేళ్లలో జీఎస్టీ అమలు పేరుతో ప్రభుత్వం 869 నోటిఫికేషన్లు, 143 సర్క్యులర్లు, 38 ఉత్తర్వులు జారీ చేయడాన్ని బట్టి విధానం ఎంత అయోమయంగా ఉందో స్పష్టం అవుతోందని' మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం పేర్కొన్నారు. జీఎస్టీ రూపకర్తల్లో ఒకరు, ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం సైతం అమలు తీరును తప్పుపడుతున్నారు.

సాంకేతికమైన సంక్లిష్టతలను తొలగించి జీఎస్టీని మరింత సరళతరం చేయాల్సి ఉంది. ఒకే స్లాబు, తక్కువ పన్ను అనే హామీని ప్రభుత్వం అమలు చేయాల్సిన అవసరం ఉంది.

డి. సోమసుందర్

# ‘అగ్ని’పథ్

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్




ప్రభుత్వం ఏదైనా ఒక పనిచేస్తే వెంటనే ప్రతిపక్షాలు ఎందుకు? ఏమిటి? అని చూడకుండా ప్రతిపక్షాలు దాన్ని తీవ్రంగా విమర్శించడం. ప్రభుత్వ పక్షాలు ఏమిటి? ఎందుకు? అని చూడకుండా దాన్ని అద్భుతంగా కీర్తించడం. ఈ దేశంలో ఈ పద్ధతి ఆనవాయితీగా మారిపోయింది. బహిరంగ చర్చలో ఏం జరుగుతుంది..ఇది మంచా? చెడా? మరింత బాగా చేయడం సాధ్యమా? ఎలా చేయాలి..ఆ చర్చలు పూర్తిగా పోయి.. తూతే మేమే అని ఒకళ్లనొకళ్లు తిట్టుకోవడం, నిరసనలు, తిట్లు, శాపనార్థాలు హింస ఆనవాయితీ అయిపోయాయి. ఒక ప్రజాస్వామ్యం ఇలా నడవదు.

అగ్నిపథ్‌నే తీసుకుంటే మనదేశంలో 15 లక్షల మంది సైనికదళంలో ఉన్నారు. అదికాకుండా బయట మరో 10 లక్షల మంది రిజర్వు దళం ఉన్నారు. ఒకవేళ పొరుగుదేశాలతో యుద్ధం వస్తే అందరూ యుద్ధంలో భాగస్వాములు కాకపోయినా మిగతా ప్రాంతాల్లో ఈ రిజర్వు దళాన్ని మోహరించొచ్చు. కానీ ఆధునిక యుగంలో ఎంతమంది సైన్యం ఉన్నారన్నది ముఖ్యం కాదు..ఎంత సమర్థత ఉందనేది ముఖ్యం. అమెరికాను తీసుకుంటే సాటిలేని మేటి సైన్యం ఆ దేశం సొంతం. ఏదేశం కూడా అమెరికాను తేరిపార కూడా చూడలేదు. అమెరికాకు దీటుగా చైనాకు ఆర్థిక శక్తి ఉన్నా కూడా సైనిక పాటవంలో అమెరికాతో పోలిస్తే దిగదుడుపే. కానీ చైనాకు కూడా చాలా పెద్ద సైన్యం ఉంది. అమెరికాకంటే చైనా బలం ఐదు రెట్లు ఎక్కువ. అయితే అమెరికా బలం ఎక్కడ ఉంది? సాంకేతిక శక్తిలో ఉంది. సరైన యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకలు, అత్యాధునికమైన ఆయుధాలు.. అమెరికా సైన్యానికి వేగంగా స్పందించే శక్తి, సామర్థ్యం ఉన్నాయి. దీనివల్ల ఒక దేశం సైనిక పాటవం రుజువవుతుంది. అంతే కానీ ఊరికే మందిని తీసుకుని జీతాలు ఇచ్చి కవాతు చేస్తే చాలదు..అయితే అది కూడా అవసరమే కానీ దానికి పరిమితులు ఉన్నాయి.

మనదేశంలో పూర్వకాలపు అలవాట్లనే ఇంకా పాటిస్తున్నాం. పదాతి దళాన్ని చాలా పెద్ద ఎత్తున రిక్రూట్ చేసుకుంటున్నాం...ప్రాధాన్యం ఇస్తున్నాం. నౌకా, వాయు దళాల్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. మరోవైపు పదాతి దళాన్ని కూడా ఆధునిక యుద్ధతంత్రానికి అనుగుణంగా సిద్ధం చేయడం లేదు. ఉక్రేయిన్‌ను చూస్తే మనకు అర్థం అవుతుంది. చాలా పటువైన ఆయుధాలు. డ్రోన్లు వంటి ఆధునిక యుగానికి అవసరమైన యుద్ధ సామగ్రి ఆ దేశం దగ్గర ఉంది. చాలా బలహీనమైన దేశం శక్తివంతమైన రష్యాను నిలువరించగలుగుతుంది. చివరికి రష్యానే కొంత భూభాగాన్ని ఆక్రమించుకోవచ్చు..చాలా పెద్ద దేశం చాలా చిన్న దేశం మీద చాలా కాలం తర్వాత గెలవడం పెద్ద కష్టం ఏమీ కాదు. నాలుగుకోట్ల జనాభా ఉన్న దేశం, రష్యాతో పోలిస్తే 30వ వంతు భూభాగం ఉన్న దేశం, రష్యాతో పోలిస్తే ఏమాత్రమూ శక్తి లేని దేశం ఉక్రేయిన్. కేవలం

పాశ్చాత్యదేశాలు ఇచ్చిన సాంకేతిక విజ్ఞానం, ఆధునిక ఆయుధాల వల్లనే రష్యాను ఆపగలుగుతోంది. ఒక్క సైనికుడ్ని కూడా ఇతర దేశాలనుంచి తెచ్చుకోకుండా ఉన్న సైన్యంతోనే రష్యాను నిలువరించగలుగుతోంది. ఆధునిక యుద్ధతంత్రం అంటే అది. దానికి తగ్గట్టుగా మార్పులు రావాలి. అదే పనిగా పదుల వేల మంది సైన్యాన్ని పెట్టాల్సిన అవసరం లేదు.

కాలక్రమేణ రక్షణ కోసం పెట్టే ఖర్చు యుద్ధంలో పనికి వచ్చే రీతిన ఖర్చు పెట్టాలని మన కేంద్రం నిర్ణయం తీసుకుంది. మనకి ప్రతీ ఏటా ఐదు లక్షల 25వేల కోట్ల రూపాయలు సైనిక దళాల కోసం ఖర్చవుతుంది. అత్యధిక భాగం కేవలం జీతభత్యాల కోసమే ఖర్చవుతుంది. విద్యాశాఖలో ఎలాగైతే టీచర్ల జీతభత్యాల కోసం ఖర్చు పెడుతున్నామో, యుద్ధంలో కూడా అలాగే సైనికుల జీతభత్యాల కోసం ఖర్చు పెడితే..ఆయుధాలన్నీ తుప్పుబట్టి ఉంటే, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ లేకపోతే, దానిలో పరిజ్ఞానం లేకపోతే ప్రపంచం ముందు మనం దిగదుడుపు అయిపోతాం. కేంద్రం తీసుకొచ్చిన ఈ కొత్త విధానంలో భాగంగా ఏటా 40 నుంచి 50 వేలమందిని తీసుకోవాలని, కాలక్రమేణా లక్షా 60వేల మందిని తీసు కోవాలని నిర్ణయించారు. నాలుగేళ్ల తర్వాత వారు ఇష్టపడనట్టయితే వారిలో మంచి శక్తి సామర్థ్యాలు చూపించిన మూడో వంతు మందిని కొనసాగిస్తారు. మిగిలిన వాళ్లు మంచి పారితోషకంతో రిటైర్ అవుతారు. వారికి వెంటనే చిన్న వయస్సులోనే వేరే ఉద్యోగం, ఉపాధి, లేదా స్వయం ఉపాధి సాధ్యమవుతుంది. ఈ ప్రయోగం చేద్దాం. దీనిలో ఏమైనా పొరపాట్లు ఉంటే సవరించుకుందాం.

అయితే మన దేశంలో ఏమౌవుతుంది. ప్రధానంగా రెండు సమస్యలు ఉన్నాయి. ఏం చేసినా, ఏ నిర్ణయం జరిగినా, ఏ చట్టం చేసినా, పూర్వాపరాల పరిశీలన లేకుండా వెంటనే వ్యతిరేకించడం ఆనవాయితీ అయిపోయింది. ఎంతమంది చప్పట్లు కొట్టారన్న దాన్ని బట్టి వాస్తవాన్ని నిర్ధారించలేం. ఏది వాస్తవం, ఏది ప్రజల ప్రయోజనాన్ని పెంచుతుంది..దాని బట్టి నిర్ణయించాలి. రైతు చట్టాల గురించి నేను ఎన్నో సందర్భాల్లో ఉదాహరణలతో సహా చెప్పాను. రైతులకు పనికొచ్చే చట్టాలు, స్వేచ్ఛనిచ్చే చట్టాలు, వెసులుబాటును ఇచ్చే చట్టాలు, కాలక్రమేణా మార్కెట్‌లో రేటును రైతుకు ఎక్కువ ఇచ్చే చట్టాలు. ఆ చట్టాలు వద్దని కొన్ని ప్రాంతాల్లో రైతులు గందరగోళం చేశారు. నిజాయితీగానే చేశారు. చిత్తశుద్ధితోనే చేశారు. కానీ అపోహలతో చేశారు. చిత్తశుద్ధి వేరు, ఆ వాదనల వెనుక ఉన్న బలం వేరు. అది కొన్ని ప్రాంతాలలోనే జరిగింది. కానీ ఢిల్లీ చుట్టుపక్కల చేసే సరికి దేశం అంతా చేసినట్టుగా ఒక వాతావరణం సృష్టించడం జరిగింది. దాంతో చట్టాలు వెనక్కి వెళ్లాయి. వ్యవసాయంలో ఆధునికీకరణ కానీ, వ్యవసాయానికి సంకెళ్లు తొలగడం కానీ మనకు ఆలస్యం అయిపోయింది. అలాగే ఈ రోజు అగ్నిపథ్ కూడా మంచి చెడు విశ్లేషణ లేకుండా గందరగోళం చేస్తున్నాం. రెండోది ఏమౌవుతుందీ.. ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇవ్వడానికి ఉన్నాయనే భావన కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ విస్తృతంగా ప్రచారం అయింది. రాష్ట్రాలలో కూడా చర్చ అదే. ఎనిమిది లక్షల ఉద్యోగాలు ఇస్తాం..ఇన్ని లక్షల ఉద్యోగాలు ఇస్తాం..అని ప్రకటనలు ఇస్తున్నారు. అంతకంటే మూర్ఖపు ఆలోచన ఇంకోటి లేదు.

ప్రభుత్వాన్ని మనం ఏర్పాటు చేసుకుంది ఉమ్మడి అవసరాలు తీర్చడం కోసం, మనకి ఉమ్మడి సేవలు అందించడం కోసం. ఆ మేరకు మంచి సిబ్బందిని పెట్టుకుని మంచి సేవలు సమర్థంగా అందించాలి. కానీ ప్రభుత్వం మన పన్నుల డబ్బులతో ఉద్యోగులను పెట్టుకుని పనిచేయించకుండా ఉండి, అసమర్థంగా ఉండి లేదా ఎక్కడ అవసరమో అక్కడ సిబ్బంది లేకుండా ఉండి, ఎక్కడ సిబ్బంది అవసరం లేదో అక్కడ కొనసాగిస్తున్నాం. ఇప్పటికీ కూడా పెద్ద సంఖ్యలో బంట్రోతులు, డ్రైవర్లు ఉన్నారు..ఆధునిక యుగంలో ఎక్కడైనా పై అధికారులకు సేవలు అందించడం కోసం బంట్రోతులు, డ్రైవర్లు కావాలా? లేకపోతే గుమస్తాలు ఉన్నారు. మనకి అవసరమైన సేవలు అందించే వారు లేరు. మనకు మంచి విద్య అందడం లేదు. ఆరోగ్యం అధ్వానంగా ఉంది. ఈ దేశంలో చట్టబద్ధ పాలన అందడం లేదు. కొన్ని ప్రాంతాల్లో వివిధ కారణాల వల్ల శాంతిభద్రతలు కరువవుతున్నాయి. పోలీసు దళాన్ని ఆధునికీకరిం చలేకపోతున్నాం. భూమిని సర్వే చేయడానికి, భూ రికార్డుల నిర్వహణకు సమర్థవంతమైన యంత్రాంగం లేదు. టెక్నాలజీ ఉపయోగించే శక్తి లేదు. ప్రభుత్వం సమాజం కంటే చాలా రంగాల్లో వెనుకబడి ఉంది. అవన్నీ ఎలా బాగు చేద్దామనే ఆలోచన చేయడం లేదు. గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఎప్పుడో ఇక్ష్వాకుల కాలం నాటి పద్ధతులు పాటిస్తూ సిబ్బందిని పెంచడమే. ఇదే తప్పును ప్రధానమంత్రిగారు కూడా చేశారు. పది లక్షల మందిని వెంటనే తీసుకుంటామని ప్రకటించారు. సంతోషం. అయితే ఇవాళ్టి అవసరాలకు సరిపడా సిబ్బంది ఉన్నారా? లేదా? శాంక్షన్డ్ స్ట్రెంత్ అంటారు..సిబ్బంది ఎంతమంది కావాలని నిర్ధారిస్తారు. అది చూడకుండా ఏ శాఖలో ఎంత మంది కావాలి..ఏ సేవ కోసం ఎంతమంది అవసరం, ఎలాంటి నైపుణ్యాలు కావాలి అనే

పరిశీలన లేకుండా ఊరికే గుడ్డెద్దు చేలో పడ్డట్టు పదిలక్షలమందిని తీసుకుంటాం..మీ అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని భావన కల్పించడమే లక్ష్యంగా మారింది. రాష్ట్రాలు అంతే..జాతీయ స్థాయి అంతే. దాంతో ఏమైందీ.. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలలో సైన్యంలో చేరడం వారందరికీ బాగా అలవాటు. అలాగే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బీహార్, రాజస్తాన్ రాష్ట్రాల వారు సైన్యంలో చేరుతుంటారు. బీహారు మినహా ఇవన్నీ ఢిల్లీ చుట్టుపక్కల ఉన్నాయి. వీరందరూ హడావుడి చేయడం, ఆర్బాటం చేయడం, హింసాత్మక ఘటనలకు పాల్పడటం, జనజీవనానికి ఆటంకం కలిగించడం ఇదొక ఆనవాయితీ అయిపోయింది. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. ప్రభుత్వాల్ని ఎన్నుకున్నది వారు నిర్ణయాలు చేయడం కోసం, పాలన చేయడం కోసం. ఆ పాలన చేసేటప్పుడు హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకోవాలి. వాస్తవాల ఆధారంగా తీసుకోవాలి. ఎందుకు ఏ నిర్ణయం తీసుకున్నారో మన ముందు పెట్టాలి. పెట్టాకా అమలు చేయాలి. కొంతమందికి వారు చేసిన నిర్ణయం ఇష్టం ఉండొచ్చు, లేకపోవచ్చు. అది రాజ్యాంగ బద్ధమైనంతవరకు, చట్టబద్ధమైనంత వరకు మనం విమర్శించొచ్చు తప్ప , వేరే మార్గాన్ని చూపెట్టొచ్చు తప్ప, పార్లమెం టులోనో, బయటో చర్చలు చేయొచ్చు తప్ప, నువ్వు చేసింది నాకు ఇష్టం లేదు కాబట్టి అడ్డుకుంటాను. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణాలొడ్డుతాననేది ప్రజాసామ్యం కానే కాదు.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తీసుకొచ్చినప్పుడే చెప్పారు..మన దేశంలో స్వతంత్ర పోరాట కాలంలో స్వేచ్ఛ లేదు కాబట్టి, ఎన్నుకున్న ప్రభుత్వాలు లేవు కాబట్టి, స్వపరిపాలన లేదు కాబట్టి నిరసన పద్ధతుల్ని రకరకాలుగా పాటించాం. హర్తాళ్లు, బందులు, సత్యాగ్రహాలు, కొన్ని సందర్భాల్లో హింసాత్మక చర్యలకు పాల్పడ్డాం. క్విట్ ఇండియా ఉద్యమంలో పదివేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆనాడు రైలు పట్టాలు తీసేశాం. రోడ్లన్నీ ధ్వంసం చేశాం. అది ఆనాటి వలస. స్వతంత్రం వచ్చాక మనందరికీ స్వేచ్ఛ వచ్చాక, వాక్స్వాతంత్ర్యం ఉన్నాక, ఓటు వేసే హక్కు వచ్చాక ఇక నిరసన పద్ధతులు మారాలి. రాజ్యాంగబద్ధమైన శాంతియుత నిరసనలు కావాలి. సమగ్రమైన చర్చ ద్వారా, మెజార్టీ నిర్ణయం ద్వారా నిర్ణయాలు తీసుకోగలగాలి. లేకపోతే ప్రజాస్వామ్యం నడవదని చెప్పారు. కానీ మనదేశంలో రాజకీయం చాలా గందరగోళం అయిపోయింది. ఈ పార్టీ, ఆ పార్టీ అనే తేడా లేదు. ఇవాళ అధికారంలో ఉన్న వాళ్లు, గతంలో ప్రతిపక్షంలో ఉండగా ఆ పనే చేశారు. ఇవాళ ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు ఆనాడు అధికారంలో ఉండి వాపోయారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి ఆ పనే చేస్తున్నారు. అంటే జీవనం కంటే, ఈ దేశ భవిష్యత్తు కంటే మనకు ఆటంకం లేని శాంతియుత సమాజం కంటే రాజకీయంగా వాళ్ల వ్యూహాలు, ఎత్తుగడలు, వాళ్ల ఓట్లు, వాళ్లు అధికారం పొందడం, అధికారం నిలుపుకోవడమే లక్ష్యంగా కొనసాగుతోంది. ఇది సరైన పద్ధతికాదు. ఎన్నో సందర్భాల్లో నేను మీ అందరి ముందు చెప్పాను. ఏ విషయం అయినా సరే నిశితంగా పరిశీలిద్దాం. సాధ్యాసాధ్యాలు, మంచీచెడూ లాభనష్టాలను విశ్లేషిద్దాం. ప్రభుత్వం తన పని తాను సమర్థంగా వేగంగా నిజాయతీగా చేయాలని కోరుకుందాం.

కానీ పనిచేయని వాళ్లని లక్షలమందిని పెట్టుకుని కేవలం మన పన్నుల డబ్బును జీతాలు ఇవ్వడం కోసం, మిగతా డబ్బును అధికారంలోకి రావడం కోసం నాయకులు కోట్లు ఖర్చు పెట్టారు కావున ఎడా పెడా దోచుకోవడం కోసం, మన జీవితాన్ని నరకప్రాయం చేయడం కోసం కాదు ప్రభుత్వాలు ఉన్నది. అది వలస కాలం నాటి ఆలోచన. ప్రజాస్వామ్య సమాజంలో ప్రతీ ఉద్యోగి మనకు పనికి రావాలి. మన ప్రయోజనాలు నెరవేర్చాలి. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు మనకు అందాలి. మన పన్నుల డబ్బు సద్వినియోగం కావాలి. మనందరం కూడా ఉమ్మడి సేవల్ని బీద కుటుంబాలు ముఖ్యంగా ఏం ఆశిస్తున్నాయో మంచి ప్రమాణాల విద్య, నా పిల్లలు రేపు బాగు పడతారు.. ఎవరితోనైనా పోటీపడతారు అని నమ్మకం కలగాలి. తెలివితేటలు ఉన్నాయి, బీద కుటుంబం కాబట్టి తెలివి తక్కువ ఏం కాదు కానీ ఆ తెలివి బయటపడే విద్య వచ్చిందనే నమ్మకం కలగాలి. మంచి ప్రమాణాల ఆరోగ్యం. ఎన్నో సందర్భాల్లో నేను చెప్పాను ఐదున్నర కోట్ల నుంచి ఆరుకోట్ల మంది ప్రతీ ఏడాది ఈ దేశంలో కేవలం అనారోగ్య కారణంగా, మంచి ఆరోగ్య వ్యవస్థ లేని కారణంగా బీదలవుతున్నారు. ఆరోగ్య వ్యవస్థ పరమ అధ్వానంగా ఉంది. అరకొరగా పైపైన చెప్పడం తప్ప మౌలికమైన మార్పులు తేవడం లేదు. చట్టబద్ధ పాలన ఈ దేశంలో లేదు. ఇవేళ ప్రతిపక్ష పార్టీల్లో ఉన్న వాళ్ల మీద కేసులంటే దేశం అంతా గగ్గోలు పెడుతోంది. ఎందుకని? చట్టం మీద నమ్మకం పోయింది. చట్టం ఉన్నవాడికి చుట్టం అన్న భావం ప్రబలిపోయింది. అధికారం ఎవరి పక్కన ఉంటే వారి పక్కన చట్టం ఉంటుందనేది అందరికీ తెలిసిందే. అలాగే ఇవాళ ఏ కేసులో కూడా త్వరితగతిన న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదు. ఒక ఆడపిల్ల మీద అత్యాచారం జరిగితే, ఒక అన్యాయం జరిగితే వెంటనే వాడ్ని కాల్చేయాలని

కోరుకుంటున్నాం. ఎందుకని..ఈ దేశంలో నేరపరిశోధన సక్రమంగా జరగదు..వేగంగా న్యాయం అందదనే భావన పెరిగిపోవడంతో వెంటనే కాల్చేయండని సమాజం కోరుకుంటోంది. ఇది ప్రజాస్వామ్యానికి నిదర్శనం కాదు. ప్రజాస్వామ్య వైఫల్యానికి నిదర్శనం. కాబట్టి చట్టబద్ధ పాలన వేగంగా కావాలి. మౌలిక సదుపాయాలు కావాలి.

మనకు రోజువారీగా అందే సేవలు మంచినీళ్లు, మురుగునీటి పారుదల కావొచ్చు, వర్షం నీటి పారుదల కావొచ్చు అవి సమర్థంగా ఉండాలి. అందుకోసం ప్రభుత్వాన్ని పెట్టాం. కానీ మనం లక్షలాది మంది ఉద్యోగుల్ని పనికొస్తారా లేదా చూడకుండా వారిని తెచ్చుకుంటున్నాం. వాళ్ల కోసం ప్రభుత్వం లేదు. మరి ఉద్యోగాలు ఎలా వస్తాయి. ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల, ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తే, మౌలిక సదుపాయాల్ని కల్పిస్తే, విద్యద్వారా నైపుణ్యాన్ని, ఆరోగ్యం ద్వారా ఉత్పాదకతను ఇచ్చినట్టయితే, పెట్టుబడులు పెంచే వాతావరణాన్ని, పోటీపడే ఏర్పాటు చేసినట్టయితే, పక్షపాతం లేకుండా అందర్నీ సమంగా చూసినట్టయితే, లక్షల కోట్ల పెట్టుబడులు, దాన్నుంచి కోట్లాదిగా మన యువత ఉపాధి పొందడం, దాని ద్వారా ఉత్పత్తి చేయడం, ఆ ఉత్పత్తిని దేశంలో ప్రజల అవసరాలను తీర్చడం కోసం ఉపయోగించడం, ప్రపంచం అవసరాలను తీర్చడం కోసం ఎగుమతులు చేయడం మనదేశం సంపన్న కావడం.. ఇది తప్ప మరో మార్గం లేదు బీదరికం పోవడానికి. ఇది అర్థం కాక లేకపోతే అర్థం అయిన వాళ్లు ప్రజలకు చెప్పక తాత్కాలిక రాజకీయ ప్రయోజనం కోసం ప్రతీ విషయాన్ని ఆర్భాటం చేస్తున్నాం. నేను వినమ్రంగా కోరుతున్నాను. ఎన్నికల సమయంలో ఇష్టం వచ్చిన వాళ్లకు ఓట్లు వేద్దాం. ఎన్నికలకు, ఎన్నికలకు మధ్య కట్టుబానిసలుగా వ్యవహరించొద్దు. పార్టీలు మన కోసం ఉన్నాయి. కానీ మనం పార్టీల కోసం లేం. ఏ పార్టీ మనకు శాశ్వత మిత్రులు కాదు..ఏ పార్టీ మనకు శాశ్వత శత్రువు కాదు. కాబట్టి ఏ పార్టీ చెప్పిందని కాకుండా , ఏ మనిషి చెప్పారని కాకుండా.. ఏం చేస్తున్నారు..ఆ చేస్తున్నది పనికొస్తుందా లేదా? అది నిజంగా సమాజ ప్రయోజనాల్ని కాపాడుతుందా లేదా? వాస్తవాల ఆధారంగా ఉందా? లేదా? తర్కబద్ధంగా ఉందా ?లేదా? హేతుబద్ధంగా ఉందా? లేదా? దాన్ని బట్టి మనం నిర్ణయం చేయాలి తప్ప ప్రతీ విషయంలో ఆవేశ పూరితంగా కేసీఆర్ చెప్పారు కాబట్టి వ్యతిరేకిస్తున్నాం, జగన్ చెప్పారు కాబట్టి వ్యతిరేకిస్తున్నాం, అలాగే ప్రతిపక్షంలో ఉన్నవారు చెప్పారు కాబట్టి అంగీకరిస్తున్నాం, మోదీ చెప్పారు కాబట్టి వ్యతిరేకిస్తున్నాం, రాహుల్‌గాంధీ చెప్పారు కాబట్టి బీజేపీ వాళ్లం అందరూ వ్యతిరేకిస్తున్నాం..ఇది సరైన పద్ధతి కాదు. వినదగు నెవ్వరు చెప్పిన. ఏం చెప్పారు..యుక్తాయుక్త విచక్షణ, అది పనికొచ్చేదా? కాదా? మనకి పనికి వస్తుందంటే కచ్చితంగా దాన్ని ఆమోదిద్దాం. ఎవరు చెప్పినా కూడా. బద్ధశత్రువు చెప్పినా కూడా , పనికిరాదనుకుంటే మనకి ఇష్టం ఉన్నవాడు చెప్పినా కూడా దాన్ని తిరస్కరిద్దాం. ప్రత్యామ్నాయాన్ని చూపెడదాం. ఇలాకాదు మరో రకంగా ఎలా చేస్తే బాగుంటుందో చెబుదాం. మనకి తెలిస్తే విషయం లోతుగా అర్థం చేసుకుందాం. కానీ గుడ్డెద్దు చేలో పడ్డట్టు నిరసనలు వద్దు. ఒకవేళ నిరసన ఉన్నా శాంతియుతంగా నిరసన ప్రదర్శించే హక్కు అందరికీ ఉంది. కానీ ఆటంకం ఉండకూడదు. హింస ఉండకూడదు. తుదిగా గుర్తించాల్సింది. ఎన్నికైన ప్రభుత్వాలు స్థానికంగా మన ఊళ్లో కావొచ్చు, మన నగరంలో కావొచ్చు, రాష్ట్రంలో కావొచ్చు, మన దేశంలో కావొచ్చు.. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధంగా తుది నిర్ణయాన్ని చేసే బాధ్యత వాళ్లకున్నది. ఆ బాధ్యత వారిని నెరవేర్చనిద్దాం. ప్రతిదానికీ రోడ్ల మీద పడి ఆటంకం చేయడం, హింసకు పాల్పడడం అనేది అరాచకత్వానికి దారి తీస్తుంది. రాజ్యాంగ వైఫల్యానికి దారి తీస్తుంది. ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తుంది.

❖

# కొత్త జిల్లాల ఏర్పాటు మంచి నిర్ణయం: జేపీ

రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు మంచి నిర్ణయమని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ్ ప్రశంసించారు. ప్రకాశం జిల్లా నామకరణ స్వర్ణోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని చెన్నపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో డాక్టర్ తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో వెలువరించిన స్వర్ణ ప్రకాశం, ప్రకాశం జిల్లా సాహిత్య చరిత్ర, ఒంగోలు గురించి ఒకింత తదితర పుస్తకాల ఆవిష్కరణ సభ ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ ప్రకాశం పుస్తకాన్ని జేపీ ఆవిష్కరించి మాట్లాడారు.

కేవలం కొత్త జిల్లాల ఏర్పాటుతో ఆగిపోకూడదని, అధికార వికేంద్రీకరణ, పాలనా వికేంద్రీకరణ జరగాలని ఆయన అన్నారు. ఓటుకు వెలకట్టే సమాజం బాగుపడదని, ఓటుకు, నిరసనకు మాత్రమే పరిమితమైతే అది బూటకపు ప్రజాస్వామ్యం అవుతుందన్నారు. పకాశం జిల్లా సాహిత్య చరిత్ర, ఒంగోలు గురించి ఒకింత పుస్తకాలను ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు.

# వలస కాలపు ఆందోళనా పద్ధతులు-

# దిగజారుడు బహిరంగ చర్చలు







స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా మన దేశంలో ఇప్పటికీ ప్రభుత్వాల పాత్ర, పౌర ఉద్యమాలు, ఆందోళనా పద్ధతులపై గందరగోళం మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. వలస పాలకులు పోయినా, ఓటు, ఇతర ప్రజాస్వామిక హక్కులన్నీ వచ్చినా.. స్వాతంత్ర్యోద్యమ సమయంలో అనుసరించిన ఆందోళనా పద్ధతుల్నే ఇంకా అనుసరిస్తున్నాం. అహింసాయుత సత్యాగ్రహాలతో దేశాన్ని ఏకం చేసి తిరుగులేని నాయకుడిగా నిలిచిన మహాత్మాగాంధీ వలస పాలనలో కూడా ఒక పరిధి దాటిన ఆందోళనల్ని అనుమతించలేదు. గాంధేయవాద ఆందోళనల్లో కనిపించిన అరాచకత్వం కూడా స్వతంత్రం వచ్చాక ఉండకూడదని, మనం వ్యక్తం చేసే నిరసనలు పూర్తిగా రాజ్యాంగబద్ధంగా, బాధ్యతాయుతంగా, ఇతర ప్రజల హక్కులకు భంగం కలిగించని రీతిలో ఉండాలని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ స్పష్టం చేశారు. అరాచక పద్ధతుల్లో కాకుండా హేతుబద్ధ చర్చతో, ఎక్కువమంది సమ్మతితో నిర్ణయాలు ఉండాలన్నారు. “మన సామాజిక, ఆర్థిక లక్ష్యాల సాధనలో రాజ్యాంగబద్ధమయిన పద్ధతులకు తప్పనిసరిగా కట్టుబడి ఉండాలి. అంటే దీనర్థం.. విప్లవం తాలూకు హింసాయుత పద్ధతులతోపాటు పౌర ఉల్లంఘన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి ప్రక్రియలను పూర్తిగా విడిచిపెట్టాలి. ఈ పద్ధతులు అరాచకవాదానికి పర్యాయపదాల్లాంటివి. వాటిని ఎంత త్వరగా త్యజిస్తే మనకంత మేలు జరుగుతుంది” అని భారత రాజ్యాంగాన్ని ఆమోదించటానికి ఒకరోజు ముందు నవంబర్ 25, 1949న రాజ్యాంగసభనుద్దేశించి చేసిన ప్రసంగంలో అంబేద్కర్ హెచ్చరించారు.

దశాబ్దాలు గడుస్తున్నా అరాచక పద్ధతులు కొత్త పుంతలు తొక్కుతున్నాయే తప్ప, మన పద్ధతుల్లో ప్రజాస్వామ్య పరిణతి పెరగటం లేదని తాజాగా కూడా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఎలాగైతే ఓటింగ్‌లో భావోద్వేగాలకు, తాత్కాలిక



ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తున్నామో.. అదే రీతిలో ఎన్నికలైన వెంటనే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా షౌటింగ్‌లతో అరాచకపు ఆందోళనలకు దిగుతున్నాం. అధికారం ఎప్పుడైతే మార్గంగా కాకుండా లక్ష్యంగా తయారైందో, ఎన్నికలు ఎప్పుడైతే నల్లడబ్బుమయంగా మారాయో ప్రభుత్వం ఏం చేసినా వ్యతిరేకించటం ప్రతిపక్షాలకు ఆనవాయితీగా మారింది. అలాగే ప్రతిపక్షాలు చెప్పే మంచిని కూడా స్వీకరించలేని అసహనంలోకి అధికార పక్షాలు జారిపోతున్నాయి. దీంతో ప్రభుత్వంలో ఉన్నప్పుడు తాము సమర్థించిన అంశాన్నే ప్రతిపక్షంలోకి వచ్చాక వ్యతిరేకించటమనే దుష్ట సంప్రదాయం పెచ్చరిల్లిపోయింది.

ఈ క్రమంలో ఎన్నికైన ప్రభుత్వాలు తమ చట్టబద్ధ బాధ్యతగా పనిచేసే అవకాశం లేకుండా కూడా కొన్ని కీలకాంశాలలో విపక్షాలు అడ్డుకోవటం ఆనవాయితీగా మారింది. అలాగే ప్రతిపక్షం గొంతు వినపడకుండా అణగదొక్కేందుకు ప్రభుత్వాలూ జులుం ప్రదర్శిస్తున్నాయి. పలు పౌర సంస్థలు, ప్రజా సంఘాలు కూడా ఈ రాజకీయ క్రీడలో భాగమైపోయాయి. ఈ అపరిపక్వ ప్రజాస్వామిక సంస్కృతికి ప్రజా ప్రయోజనాలు మూల్యం చెల్లిస్తున్నాయి.

ఇటీవలి నూతన వ్యవసాయ చట్టాలనే చూడండి. ఈ చట్టాలను తీసుకొచ్చేందుకు 2014కు ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వమే తొలుత ప్రయత్నం చేసింది. జాతీయ స్థాయి చట్టంలో ఉన్న వెసులుబాటును ఉపయోగించుకునే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2011లో తెలుగునాట ధాన్యంపై ఉన్న ఆంక్షలను ఉల్లంఘించి కర్ణాటక, మహారాష్ట్రలకు తీసుకెళ్లి అమ్మగలిగారు, రైతులకు కేవలం ఒక్క పంటపై, ఒక్క సీజన్‌లో రూ.3,600 కోట్ల లబ్ధిని చేకూర్చగలిగారు. 2019 ఎన్నికల్లో కూడా రైతులకు స్వేచ్ఛా మార్కెట్‌కు ఊతమిచ్చే చట్టాలను తెస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ అదే కాంగ్రెస్ పార్టీ 2020లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నూతన వ్యవసాయ చట్టాలను తీసుకొస్తే, గుడ్డిగా వ్యతిరేకించింది. పంజాబ్, ఆ చుట్టుపక్కల కొన్ని రాష్ట్రాల్లో రైతుల్లో ఉన్న అపోహలను ఆసరాగా చేసుకుని వారిని ఆందోళనలకు రెచ్చగొట్టింది. బీజేపీని వ్యతిరేకించే ఇతర పార్టీలు, ప్రజాసంఘాలు కూడా రైతుల ప్రయోజనం, ప్రజలకు, దేశానికి కలిగే లాభం గురించి ఆలోచించకుండా రైతులను రెచ్చగొట్టాయి. దీంతో ఢిల్లీ వద్ద రైతులు రాజ్యాంగ పద్ధతుల్ని కాలరాస్తూ సుదీర్ఘకాలం ఆందోళనలు చేశారు. ఈలోగా పంజాబ్, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల ఎన్నికలు రావటంతో మోదీ ప్రభుత్వం ఆ చట్టాల్ని, సవరణల్ని వెనక్కి తీసుకుంది.

రైతుల ఆందోళనలకు తలొగ్గి నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంది కాబట్టి, ఢిల్లీ దగ్గర రైతుల ఆందోళనలు రాజ్యాంగబద్ధతను, హేతుబద్ధతను పట్టించుకోలేదు కాబట్టి.. ఆ తరహాలోనే మనమూ చేస్తే ప్రభుత్వంపై పైచేయి సాధించగలం, డిమాండ్లను నెరవేర్చుకోగలం అనే ధోరణిని ఆ తర్వాత రైతు నాయకులు సహా పలువురు పెద్దఎత్తున మాధ్యమాల్లో, బహిరంగ సభల్లో ప్రచారం కూడా చేశారు. దీంతో, క్షేత్రస్థాయిలో మిలిటెంట్ తరహా ఆందోళనలకైనా రెడీ అనే ధోరణికి ఒక్కసారిగా మళ్లీ ఊతం లభించినట్లయింది.

రైతులకు మేలు చేసే చట్టాలను అలా స్వయంగా దెబ్బతీయటం వల్లే.. ఆ తర్వాత ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో గోధుమలకు క్వింటాలుకు రూ.1500 రైతులకు అదనంగా లభిస్తున్న సమయంలో ఆ పంట ఎగుమతుల్ని యూనియన్ ప్రభుత్వం నిషేధించినా సదరు రైతు పక్షపాతులు గట్టిగా ప్రశ్నించ లేకపోయారు. స్వేచ్ఛా మార్కెట్‌ని అడ్డుకోవటం వల్ల రైతులకు సంకెళ్లు కొనసాగుతూ నష్టం వస్తోందని చాలా స్పష్టంగా కనిపిస్తున్నా, తమ తప్పిదాన్ని ఒప్పుకునేందుకు వీరు ససేమీరా అంటున్నారు.

జిల్లా పేరు మార్పుపై కోనసీమలో ఆందోళనలు, ప్రార్థనా స్థలాలపై కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో గొడవలు, సోనియా, రాహుల్ గాంధీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణను ఖండిస్తూ ఘర్షణలు, సైన్యంలో తాత్కాలిక రిక్రూట్‌మెంట్ల కోసం



ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు మొదలైనవి వ్యవసాయ చట్టాలపై రైతు ఆందోళనల బాటలోనే ఉన్నాయి.

ప్రభుత్వాలు ప్రజల సమస్యలపై సకాలంలో స్పందించకపోవటం, మంచి నిర్ణయాలు తీసుకున్నప్పుడు కూడా వాటిల్లో అందరి అభిప్రాయాలనూ తీసుకుని ఏకాభిప్రాయంతో అమలు చేయకపోవటం కూడా సమస్యను జటిలం చేస్తుండగా.. ఆ వైఫల్యానికి సరైన పరిష్కారాలు వెతికే సంకల్పం సైతం లేకుండా రచ్చ రచ్చ చేసి ప్రచార లబ్ధి పొందాలనే ఎదుటి పక్షాలు ఉన్నకొద్దీ ప్రయత్నిస్తుండటం సంక్షోభానికి దారితీస్తోంది.

ఆర్థిక సంస్కరణలు, నూతన సాంకేతికతల నేపథ్యంలో సోషల్ మీడియా వేగంగా పెరుగుతున్నకొద్దీ క్షేత్రస్థాయిలో ఆటంకాలు, హింసాయుత ఆందోళనలు కొంతమేర తగ్గినట్లు కనిపిస్తున్నా అవి ఇంకా ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతున్నాయి. కాకపోతే వేదికను మార్చుకుంటూ సోషల్ మీడియా వైపుకి మళ్లాయి.

రాస్తారోకోలు, రోడ్ల మీద హింస వంటి భౌతిక ఆందోళనలు తగ్గాయి గానీ, ఇంకా ప్రజాస్వామిక సంస్కృతయితే తగినంత పెరగలేదనటానికి సోషల్ మీడియాలో వెలువరిస్తున్న అభిప్రాయాలు, పంచుకుంటున్న కంటెంటే నిదర్శనం. మాటల ముసుగులో తమ వ్యతిరేకతను హింసాత్మకంగా, రెచ్చగొట్టే రీతిలో సోషల్ మీడియా, టీవీ బహిరంగ చర్చల్లో వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రవక్త మహమ్మద్‌పై బీజేపీ అధికార ప్రతినిధులు చేసిన కామెంట్లు ఈ రకమైన హింసాత్మక, అప్రజాస్వామిక భావజాలం నుండే వచ్చాయి.

స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగ విరుద్ధ అరాచక ఆందోళనా సంస్కృతికి కారణమైన కుహనా సోషలిస్టువాదులే బహిరంగ చర్చ ప్రమాణాలు బలపడకుండా కూడా దెబ్బతీశారు. దేశ రాజకీయ చర్చలో ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, అవినీతిరహిత పౌర సేవలు వంటి అంశాలను రాకుండా చేశారు. పేదరికాన్ని విపరీతంగా కొనసాగించటానికి కారణమయ్యారు. ఎప్పుడైతే సరైన విద్య, ఆరోగ్యం లేకుండా పేదరికం విపరీతంగా కొనసాగిందో.. సంక్లిష్ట భిన్నత్వమున్న మన సమాజంలో ఆందోళనా పద్ధతులను రాజ్యాంగ ప్రజాస్వామ్యబద్ధంగా మార్చటం మరింత కష్టసాధ్యంగా మారింది. అందరికీ సమానంగా గొంతునిచ్చే సోషల్ మీడియాలో అవి కొత్తపుంతలు తొక్కాయి. జాతీయోద్యమ ప్రభావం ఉన్న నేతలు ఆందోళనా పద్ధతుల్లో ఆశించిన మార్పుల్ని తేలేకపోయినా, కనీసం పరస్పర గౌరవంతో వ్యవహరించేవారు. పార్టీలకతీతంగా ఈ సంస్కృతి ఉండేది. ఇప్పుడు అది కూడా లేదు. ఒకరి మీద ఒకరు ఇష్టమొచ్చినట్లు దూషణలు, ఆరోపణలకు పాల్పడుతున్నారు. పక్షపాత రాజకీయాలు పెచ్చరిల్లిపోయాయి. సామాజిక మాధ్యమాలు వచ్చాక ఇది విశృంఖలమై వ్యక్తుల మీద ఇష్టమొచ్చినట్లు బురద జల్లుతున్నారు.

ప్రభుత్వమే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవటం పరిస్థితిని ఇంకా దిగజారుస్తోంది

ఇప్పటికైనా ఈ పరిస్థితిని చక్కదిద్దుదామనే సానుకూల, దీర్ఘకాల రాజకీయాలు చేయకుండా ప్రస్తుత ప్రభుత్వాలు ప్రతికూల, తాత్కాలిక రాజకీయాలకు మరింతగా మొగ్గు చూపుతుండటంతో పరిస్థితి ఇంకా దిగజారుతోంది.

తమకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, ప్రజల్లోని కొన్ని వర్గాలు రాజ్యాంగ విరుద్ధ పద్ధతుల్లో చేస్తున్న ఆందోళనల్ని ఎదుర్కోవటానికి రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో ప్రభుత్వాలు అధికార యంత్రాంగాన్ని వీలైనంత దుర్వినియోగం చేస్తున్నాయి. ఇందుకోసం విధేయులుగా వ్యవహరించే అధికారులను కీలక పోస్టుల్లో నియమించుకుంటూ వ్యవస్థలను బలహీన పరుస్తున్నాయి. ఘాటైన విమర్శ చేయగానే నిజానిజాలతో సంబంధం లేకుండా ఏ కేసులో ఇరికించవచ్చా అని చూస్తున్నాయి. దేశంలోని కొన్ని వర్గాల ప్రజల మీద గురిపెట్టి సోషల్ మీడియాలో, భౌతికంగా దాడులకు దిగుతున్నా మాట్లాడని పాలక పక్ష పెద్దలు ఇప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బుల్డోజర్లతో ఇళ్లను కూలదోస్తున్నారు. ఈడీ వంటి దర్యాప్తు సంస్థలతో ప్రత్యర్థుల మీద దాడుల్ని ముమ్మరం చేస్తున్నారు. సొంత పార్టీ వారి మీద, మిత్రపక్షాలు అనుకున్నవాళ్ల మీద ఎన్ని కేసులు, ఆరోపణలు ఉన్నా కళ్లు మూసుకుని కాపాడుతున్నారు. నేర పరిశోధన చేసే పోలీసులు, ఆర్థిక నేరాల

దర్యాప్తు సంస్థలు పాలక పక్షాల గుప్పెట్లో ఉండటం, చట్టబద్ధపాలన కొరవడటం కూడా హింసాత్మక ఆందోళనలను పరోక్షంగా ప్రోత్సహిస్తోంది.

**రాజ్యం పాత్ర మనకు గీటురాయి కావాలి**

ఎన్నికైన ప్రభుత్వానికి నిర్ణయాధికారం ఉంటుంది, రాజ్యాంగబద్ధంగా పాలకులు నిర్ణయాలు చేసే చట్టబద్ధ బాధ్యత పాలకులకు ఉంటుంది. వాటిలో మనకు అభ్యంతరం ఉంటే సహేతుకంగా విమర్శించవచ్చు, లేదా నిర్మాణాత్మక పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేయవచ్చు, ప్రజాభిప్రాయాన్ని మలచవచ్చు. అంతేతప్ప ఆటంకాలు, హింసకు పాల్పడే హక్కు ఎవరికీ లేదు. ఇందులో భాగంగా సామాజిక మాధ్యమాల్లో, ఇతర వేదికలపై అసత్యాలను, అడ్డగోలు వాదనల్ని, విద్వేషాలను కట్టడి చేస్తూ బహిరంగ చర్చా ప్రమాణాలను పెంచాలి. ముఖ్యంగా, రాజ్య వ్యవస్థ పాత్రను సక్రమంగా నిర్వచించి అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి అంశాలను చర్చనీయాంశాలు చేయాలి.

హింస, ఆటంకాలతో కూడిన ఆందోళనలు, ప్రమాణాలు లేని బహిరంగ చర్చలు మన దేశానికి ఎంత నష్టం చేకూర్చాయో 75 ఏళ్ల స్వాతంత్ర్యం సందర్భంగానైనా గుర్తించి దిద్దుబాటు చేసుకోవాలి.

## మురార్జీ - వాజ్‌పేయి - పీవీ

**ఈవేళ్టి రాజకీయాల్లో మాటలు, పరస్పర గౌరవం ఎలా దిగజారిపోయాయో తెలియచెప్తూ.. మురార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, పీవీ నరసింహారావులు ఎలా వ్యవహరించారో సీనియర్ జర్నలిస్టొకరు ఇటీవల గుర్తుచేశారు..**

1977లో ఎమర్జెన్సీ వ్యతిరేక వెల్లువలో ఇందిరాగాంధీ పార్టీ ఓటమి అనంతరం కేంద్రంలో ఏర్పడిన మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వంలో జార్జి ఫెర్నాండెస్ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. మంత్రి పదవి చేపట్టిన కొత్తలో ఆయన హైదరాబాద్‌లో పర్యటించి ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ వద్ద జరిగిన సభల్లో ప్రసంగించారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని 'నిరంతర అబద్ధాలకోరు' అని విమర్శించారు. ఇది ప్రధానమంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్‌కు నిమిషాల్లో వేగుల ద్వారా తెలిసింది. దీంతో ఫెర్నాండెజ్‌ను సుత్తిమెత్తగా మందలించారు. ఇలాంటి మాటల వల్ల మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గొప్పతనాన్ని, సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని తక్కువ చేసి మాట్లాడినట్లు అవుతుందని చెప్పారు. 'నిరంతర అబద్ధాలకోరు' బదులుగా 'ఇందిరాగాంధీ చాలా అరుదుగా నిజాలు మాట్లాడతారు' అని సభ్యతగా అంటే బాగుంటుందని సలహా ఇచ్చారు. ఈ విషయం పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది. ఆ రోజుల్లో రాజకీయాలంటే అలా ఉండేవి.

గతంలో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు, ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న వాజ్‌పేయి అనునిత్యం విమర్శించేవారు. కానీ, ఐక్యరాజ్యసమితిలో కాశ్మీర్ సమస్యపై మాట్లాడేందుకు దేశ ప్రతినిధిగా వాజ్‌పేయినే నియమించి ఇదీ పీవీ తీవీ అని అందరూ ఆశ్చర్యపోయేలా చేశారు పీవీ. నెహ్రూ ప్రభుత్వాన్ని కూడా ప్రతిపక్ష సభ్యుడిగా వాజ్‌పేయి విమర్శిస్తూనే ఉండేవారు. కానీ జనతా ప్రభుత్వం హయాంలో నెహ్రూ చిత్రపటాన్ని విదేశాంగ మంత్రిత్వ కార్యాలయం నుంచి తొలగిస్తున్నపుడు, వాజ్‌పేయి అభ్యంతరం వ్యక్తం చేసి, ఆ చిత్రపటాన్ని మళ్లీ అదేచోట పెట్టించారు. అప్పటి నాయకుల్లో పరస్పర గౌరవం అలా ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో, వావిలాల గోపాలకృష్ణయ్య లాంటి వారున్నప్పటి కాలంలో ట్రెజరీ బెంచీలకు చెందిన మంత్రులు, విప్‌లు ప్రతిపక్ష నాయకుల దగ్గరకు వెళ్లి వారడిగిన ప్రశ్నలకు ఎలాంటి సమాధానమిస్తే ప్రజోపయోగకరంగా ఉంటుందో చర్చించిన సందర్భాలు ఉన్నాయి. ఈ రోజుల్లో పొరపాటున అధికార పార్టీ ప్రయత్నించినా, ప్రతిపక్షం సరైన స్ఫూర్తితో స్పందిస్తుందా అన్నది సందేహమే.







# స్వాతంత్ర్యం వచ్చాక...

కొందరు వ్యక్తులు, కార్పొరేట్‌లకు ప్రభుత్వం నుంచి ఆర్థిక లాభాలను సాధించటానికి పని చేసే సంస్థలు, ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేయాలనుకునే సంస్థలు.. రెండూ ఒత్తిడి బృందాలే అయినా వేర్వేరుగా చూడాలి.



ప్రజలు ఎన్నికల్లో తమ ప్రతినిధులను ప్రభుత్వంగా ఎన్నుకున్నా.. ఎన్నికల మధ్య తమ ఇష్టాలు, అభిప్రాయాలకనుగుణంగా పనిచేసుకునే, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్వేచ్ఛ, ఇందుకోసం సంస్థలు, సంఘాలుగా ఏర్పడే హక్కు ఉంది. అయితే ఎన్నికైన ప్రభుత్వాన్ని చట్టబద్ధ బాధ్యతను హరించే విధంగా, ప్రజాస్వామ్యం పనిచేయలేనిరీతిలో ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చే హక్కు ఈ సంస్థలకు ఉండదు.

ప్రభుత్వం ఎన్నికైన మరుసటిరోజు నుంచి మనకు నచ్చినట్టు చేయటం లేదంటూ రాజ్యాంగేతర పద్ధతులను సైతం ఆశ్రయించి ఆందోళనలు చేయటం చివరికి ప్రజాప్రయోజనాలనే దెబ్బతీస్తుంది. ఎంతో శక్తిమంతమైన వ్యవస్థీకృతమైన విదేశీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటం కోసం గాంధీజీ సహాయ నిరాకరణ, బహిష్కరణ, సత్యాగ్రహ, హర్తాళ్, బంద్, నిరవధిక నిరాహారదీక్ష వంటి ఆందోళన పద్ధతుల్ని రూపొందించారు. ఆయన అసమాన వ్యక్తిత్వం వల్ల అవన్నీ గొప్ప ఆయుధాలుగా రూపొందాయి. అయితే స్వతంత్ర భారతంలో కూడా అవే ఆందోళనాపద్ధతుల్ని అనుసరించటం స్వపరిపాలన అవదు.



జాతి అంతరాత్మ మీద గాంధీ ప్రభావం, స్వాతంత్ర్యోద్యమ అపురూప జ్ఞాపకాలు గాఢంగా ఉండటం వల్ల.. 'ఎన్నికవ్వని, విదేశీ, అప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి - మనలో నుంచే మనం ఎన్నుకున్న ప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి' పద్ధతుల మధ్య తేడాని మన ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా గుర్తించలేకపోతున్నాయి. ఆందోళనల పేరుతో ఆటంకాలు, అడ్డూఅదుపూలేని చట్టధిక్కారాలు వల్ల తలెత్తే ప్రమాదాల గురించి అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో హెచ్చరించారు. భిన్న స్వరాలు, భిన్న ఆకాంక్షలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ సుసంపన్నతకు అద్దం పడుతున్నప్పటికీ, వాటిని సాధించుకోవటానికి తగిన పద్ధతుల్ని మనమే గౌరవించకపోతే ఎప్పటికీ ఫలితాలు రావు.

- డా॥ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

# భారత ప్రజాస్వామ్యంలో ఉద్యమాలు, పోరాట పద్ధతులు - జేపీ నవ పరిష్కారాలు

డా॥ అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో గాంధీజీ ప్రతిపాదించిన సృజనాత్మక ఒత్తిడి పోరాటపంథాను ఆచరణలో చూపిన లోక్‌సత్తా ఉద్యమానికి, పార్టీకి వ్యవస్థాపకునిగా డా॥ జయప్రకాష్ నారాయణ్ 'భారత ప్రజాస్వామ్యంలో ఉద్యమాలు - పోరాట పద్ధతులు' గురించి వివరిస్తూ నవ పరిష్కారాలను ప్రతిపాదించారు.



1) పౌర సంస్థ వ్యక్తుల, కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాల లాబీయింగ్ కోసం పనిచేస్తుంటే.. దేశ ప్రయోజనాల దృష్ట్యా రిజిస్ట్రేషన్, పర్యవేక్షణ, పారదర్శకత విషయంలో నిబంధనల్ని కచ్చితంగా పాటించటం, నియంత్రించటం అవసరం.

2) వివాదాస్పద అంశాలు, ప్రజల మధ్య చీలిక తెచ్చే అంశాల మీద పనిచేసే పార్టీలు, పౌర సంస్థలు ఎన్నికైన ప్రభుత్వానికి విధానాల్ని నిర్దేశించటంలో తమ పరిమితిని గుర్తించాలి. విధానాలపై రాజకీయ విభేదాలుంటాయి. సాధ్యమైనంతవరకు అవి ప్రజాక్షేత్రంలో ప్రజల తీర్పుతోనే తేలాలి. ప్రజల తక్షణ అవసరాలను, దీర్ఘకాలిక ప్రయోజనాలను సమన్వయం చేయాల్సిన బాధ్యత ఎన్నికైన ప్రభుత్వాలకుంటుంది. కొద్దిమంది తరపున వివాదాస్పద అంశాల కోసం నియంత్రణలేని ఒత్తిడి చేసే సంస్థల వల్ల ప్రజాప్రయోజనాలు దెబ్బతింటాయి, పరిపాలన అసాధ్యమవుతుంది.

3) ప్రభుత్వ మౌలిక బాధ్యతల విషయంలో రాజకీయ పార్టీలు, మీడియా, పౌరసమాజం మధ్య స్థూల ఏకాభిప్రాయం ఉండాలి. జాతీయ భద్రత, శాంతిభద్రతలు, న్యాయం, చట్టబద్ధ పాలన, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్తు, నీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సహా మౌలిక వసతులు అందించటం ఆధునిక నాగరిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు చేయాల్సిన కనీస పనులని అందరూ గుర్తించాలి.

4) ఎన్నికైన ప్రజాస్వామిక ప్రభుత్వానికి, దేశ వ్యవస్థలకు తాము ప్రత్యామ్నాయం కాదని పార్టీలు, పౌర సంస్థలు గుర్తించాలి. రాజకీయ ప్రక్రియ పట్ల గౌరవం, నిరంతరం, నిర్మాణాత్మకంగా హేతుబద్ధ వాదనలు, సాక్ష్యాలతో మార్పు కోసం పనిచేయటం ఈ ఒత్తిడి బృందాల లక్షణాలుగా ఉండాలి.

5) రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో కొన్ని ఆమోదయోగ్య విధానాలతో పార్టీలు, పౌరులు, పౌరసంస్థల కార్యాచరణ ఉండాలి. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంస్థలుగా ఏర్పడే హక్కు, ఓటు.. ఇవి ఉన్నాక జనజీవితాల్ని ఆటంకపరిచే ఆందోళనాపద్ధతులకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదు. ఈ రాజ్యాంగ పద్ధతుల ద్వారానే పెట్రోలు బంకుల్లో అక్రమాల్ని అరికట్టటం, ఓటరు రిజిస్ట్రేషన్‌లో అవకతవకల్ని సరిచేయటం, నేరచరిత్రుల వివరాలు బైటపెట్టటం, ఆర్‌టీఐ, సహకార సంఘాల స్వయంప్రతిపత్తి, స్థానిక న్యాయస్థానాలు, ఎన్‌జేపీసీ వంటి దాదాపు 16 కీలక చట్టాల్ని, రాజ్యాంగ సవరణల్ని, స్పెక్ట్రం వంటి ప్రకృతి వనరులను వేలం పాట ద్వారానే కేటాయించటం వంటి పలు విధానపరమైన మార్పుల్ని అందరినీ సమన్వయం చేసుకుంటూ లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ సాధించాయి.

6) ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థా సర్వాధికారి కాదు. ఎవరైనా జవాబుదారీయే. ప్రజలు స్వేచ్ఛగా వేసిన ఓటుతో తాము ఎన్నికయ్యామన్న స్పృహ పాలకులకు ఎప్పుడూ ఉండాలి.

7) చట్టసభలు ప్రజాస్వామిక చర్చ, పరిష్కారాలకు సరైన వేదికలని పార్టీలు, ప్రతిపక్ష నేతలు, సభ్యులు గుర్తించాలి. చర్చను, స్వేచ్ఛగా అభిప్రాయ వ్యక్తీకరణను భగ్నం చేయటానికి పార్టీలు విప్ జారీచేయటం నాగరిక ప్రజాస్వామ్యం అనిపించుకోదు. చట్టసభల వైఫల్యం ప్రజాస్వామ్యాన్ని పతనం చేస్తుంది.

8) రాజకీయ వ్యవస్థల్లో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు పార్టీల్ని, ఎన్నికల ప్రక్రియను సంస్కరించాలి. సమర్థత, సేవాభావం, నిజాయతీ కలిగిన సామాన్యులు సైతం వేగంగా నైతిక పద్ధతుల్లో, ప్రత్యామ్నాయ విధానాలు చూపుతూ ఎదగగలిగేలా, ఎన్నికల్లో గెలవగలిగేలా సంస్కరణలు ఉండాలి. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలి.

9) మీడియా బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచాలి. విద్వేషం, ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా, ఒకరికి లాభం ఇంకొకరికి నష్టమనేలా చర్చ చేయటం.. హేతుబద్ధ నిర్ణయాలను, తద్వారా ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తుందని గుర్తించి వ్యవహరించాలి. ❖

# పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**- డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్**



ఈ దేశంలో పోలవరం ప్రాజెక్టు వేరు, మిగతా ప్రాజెక్టులు వేరు. రెండు పెద్ద నదులను సంధానం చేసి ఎక్కడ మిగులు ఉందో దాన్ని ఎక్కడ అవసరం ఉందో దానికి పంపే ఏర్పాటు పోలవరం ప్రాజెక్టు. ఈ తరహా ప్రాజెక్టు దేశంలోనే మొట్టమొదటిది. అందుకే దాన్ని జాతీయ ప్రాజెక్టుగా తీసుకున్నారు. రాష్ట్రవిభజనతో నిమిత్తం లేకుండా అంతకు ముందే ప్రకటించారు. విభజన చట్టంలో కూడా చేర్చారు. కానీ దాని వెనకాల ఉద్దేశం ఏంటంటే..భారతదేశంలో గంగానది తర్వాత అతిపెద్ద నదులు గోదావరి, కృష్ణ. ఈ రెండు పెద్ద నదులు సంధానం చేయడం.

గోదావరిలో నీళ్లు పుష్కలంగా వెళ్తున్నా ఉపయోగించుకోలేకపోతున్నాం. గోదావరి ఒక లోయలో ప్రవహిస్తుంది. కాబట్టి గోదావరిపై ప్రాజెక్టులు కట్టాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. పూర్వం ఇచ్చంపల్లి వంటి చోట్ల ప్రతిపాదించారు. చేస్తే బాగుంటుందనుకున్నా చేయలేదు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టినా కూడా కొంత అడవుల ముంపు ఉంటుంది కానీ అనుకున్నంత ఎత్తు రాదు. మళ్లీ అక్కడ కూడా దాన్నుంచి ఎత్తిపోతల రావాలి. కృష్ణానది పైనుంచి ప్రవహిస్తుంది. అందుకే మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పుష్కలంగా ప్రాజెక్టులు ఉన్నాయి. కానీ నీళ్లు సరిపోవడం లేదు. ఉదాహరణకు నాగార్జునసాగర్ ఆయకట్టులో పట్టిసీమ తీసుకువచ్చే వరకు కృష్ణకు మొదటి పంటకు నీళ్లు లేవు. నాగార్జునసాగర్ ఆయకట్టులో ఆరుతడి భూములన్నీ నీళ్లు లేకుండా ఉండేవి.

కాబట్టి గోదావరిలో ఎత్తు పెంచినట్టయితే గ్రావిటీ ద్వారా కృష్ణకు నీళ్లు వస్తాయి అని ఉద్దేశం. ఈ ప్రాజెక్టు మనం సాయం చేస్తే దేశానికి సాయం చేయడం. దేశంలో జలవనరులు సద్వినియోగం ఒక మౌలికమైన విధానం. హేతుబద్ధమైన యుగానికి దారి ఏర్పడుతుంది. అందుకే ఈ జాతీయ ప్రాజెక్టు.

2019లో జాతీయ స్థాయిలో నిపుణులతో లోక్‌సత్తా , ఎఫ్‌డీఆర్ ఓ కమిటీ వేసింది. ఆనాడు రాష్ట్రం మొదటి దశలో ఖర్చుపెట్టిన రూ. 8700 కోట్లు ఇంకా రాలేదు. మొదట రాష్ట్రం ఖర్చు పెడితే వాళ్లు రీయంబర్స్ చేస్తారు. ఈ రెండేళ్లలో మార్పు ఉంటే ప్రభుత్వం ఆ వివరాలు బయటపెట్టాలి. రెండోదశకు ఆనాడు అంచనా వేసింది 27వేల కోట్ల రూపాయలు. దానిలో నూటికి తొంభైపాళ్లు భూసేకరణ ఖర్చు. ప్రాజెక్టు నిర్మాణం ఖర్చు మూడు వేల కోట్లే. మొత్తం వ్యయంలో పదిశాతమే. యూపీఏ ప్రభుత్వం ఉండగా భూసేకరణ చట్టాన్ని సవరించింది. అంతకుముందు రైతులకు ఏమీ లేకుండా అన్యాయం చేసేవారు. ఇప్పుడు అసలు భూసేకరణే అసాధ్యం చేసేశారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న వారికి మార్కెట్ కంటే ఎక్కువ డబ్బు వచ్చేలా ఏర్పాటు చేశారు. దాంతో ఇబ్బడిముబ్బడిగా ధర పెరిగిపోయింది. జాతీయ ప్రాజెక్టు అని అంగీకరించిన తర్వాత కేవలం పదిశాతం ఉండే సివిల్ ఖర్చులు ఇస్తామంటే ఎలా? తొంభైశాతం ఖర్చు భూసేకరణ. కాబట్టి మొదటి దశ 41.5 మీటర్లు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నీళ్లొస్తాయి. ఇప్పుడు గ్రావిటీ ద్వారా నీళ్లు రావడం లేదు. కాబట్టి పట్టిసీమ పెట్టి ఎత్తిపోతల పెట్టాం. అది లేకుండా గోదావరిలో మట్టాన్ని తగిన స్థాయిలో పెంచితే కృష్ణకు నీళ్లు గ్రావిటీ ద్వారా వస్తాయి. కానీ నీళ్ల నిల్వ సరిపోదు. ఆపైన 45.5 చేసినట్టయితే అప్పుడు మనకు పోలవరం రిజర్వాయర్‌లో నీళ్లు నిల్వ ఉంటాయి. అందుకని రెండోదశ తర్వాత చూద్దాం. మొదటి దశ పూర్తి చేయండి..రూ.8000 కోట్లు ఇచ్చేయండి, రెండో దశ ఈ డబ్బు మొత్తం అందేటట్టుగా ఏర్పాటు చేయండని చెప్పాం. ఇప్పటికి కూడా ఇంకా మొదటి దశ పూర్తి కాలేదు.

ప్రభుత్వాలు మారినప్పుడల్లా మళ్లీ మొదటికి వస్తోంది.

2014లో చంద్రబాబు ప్రభుత్వంవచ్చినా మొదటి రెండేళ్లు పనిచేయలేదు. 2016లో గట్టిగా పని మొదలెట్టారు. ఆ రెండేళ్లు నేను గట్టిగా విమర్శించాను. ఇంత గొప్ప ప్రాజెక్టు, కీలకమైన ప్రాజెక్టు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని. కానీ మొదలెట్టాక చాలా వేగంగా పనులు కొనసాగించారు. తమకు నష్టం వచ్చినా కూడా కొంతమంది కాంట్రాక్టర్లు రాష్ట్రం మీద మమకారం, రేపు ముఖ్యమంత్రి గారో, ప్రభుత్వమో సాయపడుతుందిలే అనే ఉద్దేశ్యంతో ముందుకు వచ్చి ఆనాడు పనులు చేపట్టారు.

కొత్త ప్రభుత్వం రాగానే వారిని తీసిపారేసి కొత్తవారిని పెట్టే కార్యక్రమం పెట్టుకున్నారు. ప్రభుత్వాలు మారడం, ఈ గందరగోళాల వల్ల సమయం గడిచిపోతుంది. ఇప్పుడు సాంకేతిక కారణాలు ఉండొచ్చు, డబ్బు కారణాలు ఉండొచ్చు. ఎలాగైతే మేము అప్పుడు చాలా పారదర్శకంగా వివరాల్ని బయటపెట్టామో..అలా వివరాల్ని పారదర్శకంగా బయటపెట్టండి..

జాతీయస్థాయి ప్రాజెక్టును కేంద్రానికే వదిలేయాల్సిందనే వాదనలు ఉన్నాయి..అయితే జాతీయ స్థాయి ప్రాజెక్టులు పూర్తయిన దాఖలు ఈ 30 ఏళ్లలో లేవు. పోలవరాన్ని ఒకటి రెండేళ్లలో పూర్తి చేయాలనే సంకల్పం మనది. కనీసం మొదటి దశను ఏడాదిలో, రెండోదశను రెండేళ్లలో పూర్తి చేయాలని అనుకున్నాం. అయితే అది అసాధ్యం ఏం కాదు. రాష్ట్రం ఒకసారి మనది అని పట్టుదలతో చేస్తే వేగంగా అవుతుంది. కొంతకాలం పాటు శరవేగంగా పూర్తి చేశారు. కాబట్టి రాష్ట్రం చేయడం తప్పు కాదు. కానీ సమన్వయం జరగాలి. ప్రాజెక్టు అంచనాలు కానీ, డిజైన్ కానీ, డబ్బులు సకాలంలో విడుదల చేయడం కానీ ఇలా లక్షా తొంబై పనులు ఉన్నాయి. ప్రాజెక్టు అథారిటీ ఒకటి ఉంది. వీళ్లందర్నీ సమన్వయం చేయాలి. రెండోది డబ్బులు వెంటనే ఇవ్వాలి. కనీసం మొదటి దశ అయినా పూర్తి చేయండి. రెండో దశ తర్వాత చేద్దాం. అది చేయకపోవడం దేశానికే చాలా అన్యాయం చేసినట్టు. పోలవరం ప్రాజెక్టు వల్ల గోదావరి జిల్లాలకు తేడా ఏమీ లేదు. ఈ ప్రాజెక్టు లేకపోయినా నీళ్లు వస్తున్నాయి. అక్కడ రెండు పంటలు పండుతున్నాయి. కృష్ణా డెల్టాకు ఎలాగు పట్టిసీమ నీళ్లు వస్తున్నాయి..ఇప్పుడు మరింత ఖాయంగా వస్తాయి.

లాభం ఎవరికి? తెలంగాణకు, పైన ఉన్న మహారాష్ట్రకు . ఎందుకంటే ఎప్పుడైతే కృష్ణా డెల్టాకు నీళ్లను ఎత్తిపోతల పథకం ద్వారా తీసుకువస్తున్నారో అప్పుడు నాగార్జునసాగర్ నుంచి నీళ్లు కిందకి వెళ్లక్కర్లేదు. కాబట్టి ఇది అందరికీ ప్రయోజనం. నదీజలాలను అనుసంధానం చేసే ప్రాజెక్టులు ఎప్పుడు కూడా దేశం మొత్తానికి పనికి వస్తాయి. పైన ఉన్న రాష్ట్రాలకు లాభం. ❖

# ఆర్థిక సంఘం నివేదికను ప్రజల ముందుంచాలి



రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులను పన్ను చెల్లింపుదారులకు తెలియకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొక్కిపట్టటం ప్రజాస్వామ్య విరుద్ధమని, వెంటనే నివేదికను బహిర్గతం చేయాలని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సాంబిరెడ్డి, కార్యదర్శి ఎం.వి ఆంజనేయులు విజయవాడలో డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖను మెయిల్ ద్వారా పంపామన్నారు. నాలుగో ఆర్థిక సంఘం చైర్మన్ నివేదికను అక్టోబర్ 30, 2019న సమర్పించారని, అందులో ఏముందో ఇప్పటికీ ప్రభుత్వం వెల్లడించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం నుంచి స్థానిక సంస్థల (ప్రభుత్వాల)కు ఎంత వాటా నిధులివ్వాలి అనే అంశంపై రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రధానంగా సిఫార్సు చేస్తుందని, అలాగే స్థానిక సంస్థల ఆదాయాలను పెంచటానికి ఏమి చేయాలో కూడా సూచిస్తుందని వివరించారు. వీటిని ప్రభుత్వం ఆమోదించటం లేదా తిరస్కరించటం చేయవచ్చని, అయితే ఆ అంశాలను, వాటితోపాటు తీసుకున్న చర్యలను అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సి ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు అలా చేయలేదని ఆరోపించారు. ఆర్థిక సంఘం సిఫార్సులతో సంబంధం లేకుండా ఆస్తి పన్ను లెక్కింపు విధానాన్ని అద్దె విలువ నుంచి ఆస్తి విలువ ప్రాతిపదికకు మార్చారని, చెత్త తరలింపుకి యూజర్ ఛార్జీలు వసూలు చేసి క్లీన్ ఆంధ్రప్రదేశ్ ఖాతాకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇలా చేయటం చట్టవిరుద్ధమని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు, రాష్ట్రంలో అయిదో ఆర్థిక సంఘాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని ఏపీ ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించిందన్నారు.

# తెలంగాణలో విద్యా ఎమర్జెన్సీ

-ఆర్.వెంకటరెడ్డి, జాతీయ కన్వీనర్, ఎం.వి ఫౌండేషన్-


గత నవంబర్‌లో దేశవ్యాప్తంగా నిర్వహించిన 'నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2021'లో 3,5,8,10 తరగతి విద్యార్థులకు తరగతివారీ సామర్థ్యాలపై అధ్యయనం జరిగింది. తెలంగాణలో 46% ప్రభుత్వ, 39 శాతం ప్రైవేటు, 15 శాతం కేంద్ర, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహించారు. ఇందులో 17.8 శాతం ఎస్సీ, 10.8 శాతం ఎస్టీ, 59.8 శాతం బీసీ, 11.4 శాతం ఇతర వర్గాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సర్వే ప్రకారం తెలంగాణలో పదవ తరగతి విద్యార్థులకు కూడా సరిగా చదవడం, రాయడం రావడం లేదు. ఇంగ్లీషులో పదాలను, వాక్యాలను సొంతంగా చదవలేకపోతున్నారు. ఈ పరిస్థితి కేవలం ప్రభుత్వ బడులకు వెళ్ళే విద్యార్థులదే కాదు. తల్లిదండ్రులు కాయకష్టం చేసి ప్రైవేటు బడులలో నాణ్యమైన విద్య అందుతుందనే ఆశలతో భారీ ఫీజులు చెల్లిస్తే, ప్రైవేటు బడులకు వెళుతున్న పిల్లల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, పట్టణ ప్రాంత విద్యార్థులకు, బాలికలకు, బాలురకు కూడా విద్యాసామర్థ్యాలు పొందడంలో పెద్ద తేడా ఏమీ కనపడలేదు.

ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల పిల్లలలో అభ్యసన లోపాలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లుగా ఈ నివేదిక బయటపెట్టింది. మొత్తంగా చూస్తే జాతీయ స్థాయి నివేదిక ప్రకారం దాదాపు 50 శాతం విద్యార్థులు కనీస అభ్యసన సామర్థాలు పొందడం లేదు. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో అన్ని తరగతుల విద్యార్థుల సామర్థ్యాలు దేశంలోని 37 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలలో అట్టడుగున 35, 36వ ర్యాంకులో ఉండడం విచారకరం. దీనిని ఒక విద్యా ఎమర్జెన్సీగా భావించాలి.

ఇలా నివేదికలు ప్రతి సంవత్సరం వస్తూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం ఆరంభంలో 'త్రీ ఆర్స్' అని లేదా మరో పేరుతో ఒక పదిహేను రోజుల తంతు జరిపి మళ్ళీ యథాస్థితి పరిస్థితిని ఉంచుతుంది తప్ప ఒక మౌలికమైన ప్రణాళికను ఎప్పుడూ అమలు చేయడం లేదు.

విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించడం లేదని నివేదికల మీద నివేదికలు వస్తూనే ఉన్నాయి. తరగతి స్థాయికి తగ్గ సామర్థ్యాలకు విద్యార్థులు ఎంతో దూరంలో ఉన్నారని యునిసెఫ్, ప్రపంచ బ్యాంకు నివేదికలు ఇచ్చాయి. నేర్చుకోవడంలో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణలు ఇవ్వాలని, ఎప్పటిలాగా మామూలు స్థితిలో కాకుండా ప్రత్యేక ప్రణాళికలు వేయాలని పలు నివేదికలు తెలియచేస్తున్నాయి. అయినా అటుగా




ప్రయత్నాలు జరుగుతున్నట్లు లేవు.

ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పిల్లలే ఎక్కువగా ఈ దుస్థితిలో ఉంటున్నారని కూడా ఈ నివేదికలు సూచిస్తున్నాయి. ఈ నివేదికలే కాకుండా తెలంగాణలో బాలల హక్కుల సంస్థలు, తల్లుల సంఘాలు బడులలో సామాజిక తనిఖీలు చేసినప్పుడు విద్యార్థులు చదువులో తరగతివారీ సామర్థ్యాలలో ఇంకా వెనుకబడి ఉన్నారని వెల్లడవుతోంది. 2021 జూన్‌లో తెలంగాణలోని 25 జిల్లాలలో సామాజిక కార్యకర్తలు నిర్వహించిన సర్వే ప్రకారం 3వ తరగతి నుంచి 6వ తరగతి దాకా చదివే పిల్లలలో 52 శాతం మంది విద్యార్థులు తేలిక పదాలు కూడా రాయలేకపోయారని, 56 శాతం మందికి కూడికలు, తీసివేతలు చేయడం రాలేదని తెలిసింది. నారాయణపేట జిల్లాలోని ఒక గ్రామంలో ఏప్రిల్ నెలలో చేసిన సామాజిక తనిఖీలో 190 మంది విద్యార్థులలో మూడవ తరగతి స్థాయి ప్రశ్నలకు కేవలం 19 మంది పిల్లలు మాత్రమే తప్పులు లేకుండా పూర్తిగా రాయగలిగారు. అలాగే నలుగురు విద్యార్థులు మాత్రమే గణితం ప్రశ్నపత్రాన్ని పూర్తి చేయగలిగారు. ఇంగ్లీషులో ముగ్గురు విద్యార్థులు మాత్రమే పూర్తిగా రాయగలిగారు. ఈ పరిస్థితిని చూసి తల్లిదండ్రులు చాలా ఆందోళన చెందుతున్నారు. విద్యా సామర్థ్యాలు అందడం లేదని 2017లో ఇదే విషయమై తెలంగాణ ప్రధాన న్యాయస్థానంలో ప్రజావ్యాజ్యం కూడా

దాఖలయింది.

రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా కోర్టుకు సమర్పించిన నివేదికలు ఏదో మొక్కుబడిగా ఉన్నాయే తప్ప ఈ పరిస్థితిని అంత గంభీరంగా పరిగణించినట్లు ఏ మాత్రం కనిపించలేదు. విద్యార్థులలో విద్యా సామర్థ్యాల లోపం ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమయ్యామని ఈ సర్వేల ఆధారంగా ముందుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తే, దీనికి సరైన సమాధానం లభిస్తుంది.





రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఒక సంక్షోభంలో ఉంది. నాణ్యమైన విద్య అందించడంలో చాలా వెనుకబడి ఉంది. విద్యాశాఖ అధికారులు విద్యా సామర్థ్యాల మీద దృష్టి పెట్టకుండా ఇతర పనుల మీద దృష్టి కేంద్రీకరిస్తున్నారని చెప్పడానికి ఈ నివేదికలు ఒక ఆధారం. ప్రభుత్వ ఉపాధ్యాయుల ఖాళీల స్థానంలో దాదాపు 12 వేల మంది విద్యా వాలంటీర్లు పనిచేసేవారు. వాళ్ళను తిరిగి నియామకం చేయకుండానే గత విద్యాసంవత్సరం గడిచిపోయింది. అలాగే వందల మంది పర్యవేక్షణ అధికారులైన మండల విద్యాధికారులు లేకుండానే మన పాఠశాల విద్య కొనసాగుతోంది.

క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు రాష్ట్ర స్థాయిలో తీసుకుంటున్న నిర్ణయాలకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. విద్యాశాఖ ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలి. తమ పిల్లలు విద్యకు దూరమయ్యారని ఆందోళనలో ఉన్న తల్లిదండ్రులకు ఒక నమ్మకాన్ని ఇవ్వాలి. మీరు నేర్వగలరు అనే ఒక విశ్వాసాన్ని విద్యార్థులకు ఇవ్వాలి. ప్రతి విద్యార్థి మీద శ్రద్ధ వహించాలి. కనీస విద్యా సామర్థ్యాలు అందించకుండా సిలబస్ పూర్తి చేయాలనే టీచర్ల పైన ఒత్తిడి ఉంచడం కూడా విద్యా సామర్థ్యాలు అందకపోవడానికి ఒక కారణం.

పదవ తరగతి మొదలుకొని అన్ని తరగతులలోను చిన్న చిన్న పదాలు కానీ, కూడికలు తీసి వేతలు కానీ రాని విద్యార్థులు ఉన్నప్పుడు సిలబస్ పూర్తి చేస్తే విద్యార్థులకు ఎలా అర్థం అవుతుంది అనేది విద్యాశాఖ ఆలోచించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో రాయడం, చదవడం, సామాన్య లెక్కలు వచ్చేంత వరకు విద్యార్థులందరికీ యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. దానికి తగ్గ విద్యా సామాగ్రిని తయారు చేయాలి. తరగతి స్థాయి సామర్థ్యాలు అందుకోవడం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్నద్ధం చేయాలి. ఈ ప్రక్రియ జరగాలంటే స్కూల్‌కు, ఉపాధ్యాయులకు విద్యా ప్రణాళిక తయారు చేసుకోవడానికి తగిన స్వేచ్ఛను ఇవ్వాలి. ప్రతి విద్యార్థి కోసం ఒక ప్రణాళికను వేసుకునే వెసులుబాటును ఇవ్వాలి. అప్పుడే ఈ సంక్షోభం నుండి బయటపడగలము.

పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామర్థ్యాలు అందించకపోవడం అంటే సమాజంలో నూతన అసమానతలకు బీజం వేయడమే అని గుర్తించాలి. పిల్లలందరికీ తరగతివారీ విద్యాసామర్థ్యాలను అందించేందుకు విద్యాశాఖలో ఉన్న ప్రతి అధికారి పూర్తి బాధ్యత వహించాలి. ఇన్ని వేల కోట్ల రూపాయల బడ్జెట్లు కేటాయించి కూడా విద్యా సామర్థ్యాలు అందించలేకపోవడం, దీనికి ఒక్క అధికారి కూడా జవాబుదారీగా ఉండకపోవడం విచారకరం. వచ్చే విద్యా సంవత్సరం నుంచయినా విద్యా సామర్థ్యాలు అందిస్తామని విద్యాశాఖ గ్యారంటీ నివ్వాలి. అందుకుగాను విద్యాశాఖలో ఉన్న ఉన్నతాధికారులు ఒక్కో జిల్లాను దత్తత తీసుకుని పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జిల్లాలో విద్యార్థులందరికీ రాయడం, చదవడం, సామాన్య గణితం వచ్చేలా చర్యలు చేపట్టాలి.

విద్యా సామర్థ్యాలు అందించే ప్రక్రియను పర్యవేక్షించడానికి స్వయం ప్రతిపత్తి గల కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. పిల్లలకు విద్యా సామర్థ్యాలు అందించడం ప్రభుత్వాల చట్టబద్ధబాధ్యతగా గుర్తించాలి. నాణ్యమైన విద్యను అందించడం అంటే రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనగా గుర్తించాలి. అంతేకాకుండా వచ్చే తరం ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అత్యధిక శాతం పౌరులు చదవడం, రాయడం రాని, బడికి వెళ్లిన నిరక్షరాస్యులుగా, నైపుణ్యత లేని కార్మికులుగా మార్కెట్‌లో అతి చౌకగా లభించే కార్మికులుగా మిగిలిపోవడానికి మనమే కారకులమవుతామని గుర్తించాలి. బాలలకు నాణ్యమైన విద్య అందించనప్పుడు ఎన్ని పెట్టుబడులు వచ్చినా, ఎన్ని ప్రాజెక్టులు నిర్మించినా, ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టినా ఏమి లాభం? నాణ్యమైన విద్యను అందించకుండా రాబోయే తరాలను నూతన సామాజిక అసమానతల విషవలయంలోకి ప్రభుత్వమే నెట్టివేసినట్లు భావించాల్సి వస్తుంది. ఈ అపవాదం రాకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వ పెద్దలదేనని గుర్తించాలి. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికీ తరగతివారీ విద్యా సామర్థ్యాలు అందించడానికి తప్పక తగు చర్యలు చేపడతారని ఆశిద్దాం.

**(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# అంకెలను చదవడంలోనూ తడబడ్డ అయిదు విద్యార్థులు

తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు తెలుగులో సరిగా చదవడం, రాయడం రావటం లేదని, ఇంగ్లీషులో పదాలు, వాక్యాలను సొంతంగా చదవలేకపోతున్నారని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2021 వెల్లడించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు జాతీయ సగటుతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని, గత నాలుగేళ్ల వ్యవధిలో విద్యార్థుల సామర్థ్యాల స్కోరు మరింత తగ్గినట్లు సర్వే నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో 3,5 తరగతుల విద్యార్థులకు భాషలు, గణితం, పర్యావరణం, 8వ తరగతి విద్యార్థులకు గణితం, సోషల్ సైన్సెస్, సైన్స్, భాషలు, పదో తరగతి విద్యార్థులకు మోడ్రన్ లాంగ్వేజి, గణితం, సైన్స్, సోషల్ సైన్సెస్, ఇంగ్లీషు భాషపై అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసింది. ఈ సర్వేలో రాష్ట్రానికి చెందిన 4,781 పాఠశాలల్లో 22,818 మంది టీచర్లు, 1,45,420 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ఒకటి రెండు జిల్లాలు మినహా మిగతా జిల్లాల్లోని విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయి.

భాషలు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లీషు, పర్యావరణం సబ్జెక్టుల్లో 70 శాతం మంది అవగాహనా స్థాయి సాధారణం, అంతకన్నా తక్కువగా ఉంది. జాతీయ స్థాయి సగటుతో పోలిస్తే రాష్ట్ర విద్యార్థుల సగటు తక్కువగా నమోదైంది. సర్వేలో విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాల్లో సగటున 45 శాతమే సరైనవిగా నమోదయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల విద్యార్థులు వెనుకబడి ఉన్నారు.

**మూడో తరగతి:** విద్యార్థులు చిన్న పదాలు, తరగతి గదుల్లోని గోడలపై పోస్టర్ల అంశాలు, గేయాలు చెప్పలేకపోయినట్లు వెల్లడైంది. గణితంలో మూడంకెల విలువల్ని వాటి స్థానాల ఆధారంగా గుర్తించడంలో ఇబ్బంది పడ్డారు. కూడికలు, తీసివేతలు, భాగాహారాలు చేయలేకపోయారు. పక్షులు, ఆహారం, జంతువులను గుర్తించడంలో విఫలమయ్యారు.

**అయిదో తరగతి:** రోజువారీ జీవితంలో భాగమైన సంఖ్యలను వినియోగించలేకపోయారు. త్రిభుజం, చతురస్రం, దీర్ఘచతురస్రం చుట్టుకొలత, వైశాల్యం గణించలేకపోయారు. సంఖ్యలను చదవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, విపత్తులపై అవగాహన కొరవడింది.

**ఎనిమిదో తరగతి:** తరగతి గదిలోని వస్తువులు, చతురస్ర, దీర్ఘచతురస్ర వస్తువులు, గది నేల, చాక్‌పీస్ బాక్సు చుట్టుకొలత, వైశాల్యం లెక్కించలేకపోయారు. భాగాహారాలలో వెనుకబడ్డారు. దైనందిన జీవితానికి సంబంధించిన సంఖ్యల సమస్యలకు సమాధానాలివ్వలేదు. పటాలపై చారిత్రక ప్రదేశాలు, ప్రాంతాలను గుర్తించలేకపోయారు. 1857 సిపాయిల తిరుగుబాటుపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు.

## జాతీయ స్థాయిలో..

**నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) 2021లో దేశవ్యాప్తంగా 720 జిల్లాల్లోని 1.18 లక్షల పాఠశాలల్లో సుమారు 34 లక్షల మంది విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు.**

+ జాతీయ స్థాయిలో ఈ సర్వేలో మూడో తరగతి విద్యార్థులు చిన్న చిన్న పదాలు, గేయాల్ని సైతం చెప్పలేకపోయారు.
+ త్రిభుజం, చతురస్రం వైశాల్యాలను గణించటంలో, సంఖ్యలో గుర్తించి చదవటంలో అయిదో తరగతి పిల్లలు విఫలమయ్యారు.
+ 1857 నాటి సిపాయిల తిరుగుబాటుపై ప్రశ్నలకు ఎనిమిదో తరగతి విద్యార్థులు జవాబులివ్వలేకపోయారు.
+ ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పదో తరగతివారూ మాతృభాషలో, ఆంగ్లంలో పదాలు వాక్యాలను చదవలేకపోతున్నారు.
+ 3,5 తరగతులతో పోలిస్తే 8, 10 తరగతుల్లో అభ్యసన సామర్థ్యాల పతనం మరింత ఎక్కువగా ఉంది.
+ వేర్వేరు తరగతులవారు భాషల్లో కన్నా గణితం, సైన్స్ వంటి సబ్జెక్టుల్లో వెనకబడుతున్నారు.
+ 2017 జాతీయ అచీవ్‌మెంట్ సర్వేతో పోలిస్తే పంజాబ్, రాజస్థాన్ మినహా మిగిలిన చోట్ల అభ్యసన సామర్థ్యాలు, స్థాయీ ప్రమాణాలు క్షీణించాయి.
+ నాలుగో వంతు పాఠశాలల విద్యార్థులకు ఇంట్లో సరైన తోడ్పాటు కరువైంది. జాతీయ స్థాయిలో 24 శాతం, అస్సాం మణిపూర్ లాంటి చోట్ల 48 శాతం విద్యార్థులకు ఇంటి వద్ద డిజిటల్ ఉపకరణాల కొరత ఉంది.

| తరగతి | జాతీయ సగటు స్కోరు | తెలంగాణ సగటు స్కోరు |
|---|---|---|
| 3 | 59.00 | 45.60 |
| 5 | 49.00 | 38.60 |
| 8 | 41.90 | 37.20 |
| 10 | 37.80 | 36.70 |

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

**ఆచరణయోగ్యమైన ప్రజాస్వామ్యం !!**
**అంతా "మనోళ్లే ! జుగాడ్ 50:50 నేటి రాజకీయం !**

జూన్ 2022 ఆఖరి వారంలో, మహారాష్ట్రలో జరిగిన రాజకీయ సంక్షోభంలో, సిద్ధాంత నిబద్ధతలేని రాజకీయ పార్టీల అధినేతలూ వారియొక్క అనుచరులూ, ఒకసారి అధికారం చేతికి వస్తే ఎలా ప్రవర్తిస్తారో ఓటర్ల సాక్షిగా నిరూపించారు. జుగాడ్ ఓటర్లకు కావలసింది భద్రత, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, లొసుగులులేని చట్టబద్ధ పరిపాలన, ఉద్యోగ/ ఎన్నికల/ వ్యవసాయ రంగాలలో సంస్కరణలు, అధికార వికేంద్రీకరణ, ఆర్థిక వికేంద్రీకరణ.

**మనమంతా భారతీయులమే. మనది ఏకైక ఓటర్ల జాతి !**
**ఎవరికి వారే అయితే ఏకా'కులం'. ఏకమైతే మన మతం 'సర్వజన సమ్మతం'**
**మనపార్టీ గెలిస్తే మనది అనుకూలమైన అధికార పక్షం.**
**ఓడిపోతే బాధ్యతతో వ్యవహరించగలిగిన ప్రతికూల పక్షం**

ఇది ఏ ఒక్కరి పార్టీ కాదు. అందుచేత మనకు తగినట్టు మన అవసరాలకు తగ్గట్టు నిర్మించుకుందాం రండి! మన ప్రతిపాదిత "జుగాడ్ పార్టీ ద్వారా అంతర్గత ప్రజాస్వామ్య తరహాలో ఎంపికయిన మీ MLA అభ్యర్థి "మనోడు' కాదని ఇంకో పొలిటికల్ పార్టీ లోని "మనోడికి' మీయొక్క అమూల్యమైన ఓటు వేసి గెలిపించారనుకోండి. అతను ఎన్నికయిన మర్నాడే "కండువా మార్చేసుకుని మన ప్రతికూల పొలిటికల్ పార్టీ ఇచ్చిన డబ్బుకి దాసోహమైపోతే ఏమీ చేయలేము. ఎన్నికల సమయంలో ఓటర్లంతా సమానమే, కాబట్టీ జుగాడ్ పార్టీ అభ్యర్థిని చూడగానే జనాలు గుర్తుపడతారు. కండువాలుండవు, కటౌట్లుండవు, ఫ్లెక్సీలుండవు. ఈపార్టీలో నేరచరితులకు B-Form లభించదు. ఎవర్ని ఎన్నుకుంటారో ఓటర్ల ఇష్టం.

**జుగాడ్ పార్టీ రాజ్యాంగ విభాగం** (Model Political System)

ఇంచుమించుగా, ఇది మన భారతదేశ రాజ్యాంగాన్ని పోలి ఉంటుంది. (చట్టసభ, పరిపాలనావిభాగం, న్యాయం - నీతి- క్రమశిక్షణ , సమాచార విభాగం) అధ్యక్షుడు, లేక అధ్యక్షురాలు ఉంటారు.
దీని నిర్వహణకై నిధులు జుగాడ్ ఓటర్లే (JVs) ఒకేసారి (రూ.2500, లేదా రూ.5,000 లేదా రూ. 10,000) ఇచ్చే చందాల ద్వారా సమకూర్చుకుంటారు. కార్యకర్తలకు ఖర్చులనిమిత్తం డబ్బు ఇవ్వాల్సి వస్తే జేవీలే నిర్ణయిస్తారు. విధివిధానాలూ, ఎన్నికల అజెండాలూ అన్నీ ఈ విభాగం లోనే జరుగుతాయి. మిగతా అన్ని వివరాలూ జుగాడ్ ఓటర్లుగా నమోదయిన తరువాత మాత్రమే. మనకి ఇష్టమున్నా లేకపోయినా గుండె రాయిచేసుకుని ఆమాత్రం డబ్బు దానం చేయండి. ప్రగతిశీలక సలహాలతో సత్పరిపాలనకు సహకరించండి. రాబోయే "జుగాడ్ సుస్థిర ప్రభుత్వాలు 75 శాతం మెజారిటీ ఓట్లతో రాబోతున్నాయి. పార్టీకి సంబంధించిన మిగతా విధాన నిర్ణయాలన్నీ కనీసం 25 మంది (గరిష్టం 100 మంది) కార్యకర్తలున్న అంతర్గత అధికార కమిటీ ఉభయ తెలుగు రాష్ట్రాలకు ప్రకటిస్తుంది. అనుసంధానకర్త అధికార కమిటీ నిర్ణయాలకు లోబడి వ్యవహరించ వలసి ఉంటుంది.

కేంద్రప్రభుత్వానికైనా రాష్ట్ర ప్రభుత్వానికైనా ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం. ప్రభుత్వ నిర్వహణకు GST, Incometax వంటి వివిధ పన్నుల రూపేణా లభించిన మన డబ్బే ఖర్చుపెడతారు, కాబట్టీ మన ప్రతిపాదిత జుగాడ్ పార్టీ నిధులు ఎలాసమకూర్చుకుంటుందో ఆ నిధుల్ని ఎలాఖర్చు పెడుతుందో అత్యంత పారదర్శకంగా మిగతా ఓటర్లకూ, మిగతా పార్టీలకూ తెలియ పరిచేలాగ వ్యవహరించడం జుగాడ్ ఓటర్ల / కార్యకర్తల కనీస కర్తవ్యం.

M.Parthasarathy (9866416798) & 25 other Jugaad Voters READY with Rs 1 lakh starting Fund.

EVERY VOTER SHOULD THINK INDEPENDENTLY AND JOIN IN GOOD GOVERNANCE !

ADVT

# విద్యా సామర్థ్యాల కోసం డిమాండ్ చేద్దాం!



మన పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న మూడింట రెండొంతుల మంది పిల్లలు వారి వారి తరగతులకు సంబంధించిన సామర్థ్యాలు లేక తీవ్రమైన మానసిక ఒత్తిడితో సతమతమవుతున్నారు. చాలా సందర్భాల్లో బడుల్ని వదిలిపెడుతున్నారు. తగిన విద్యా సామర్థ్యాలు అందక బడుల నుండి బయటకొస్తున్న పిల్లలు ఉపాధిలో ఉన్నత విద్యలో వెలివేయబడి నూతన అసమానతలకు గురవుతున్నారు.

“మా పిల్లలకు తరగతికి తగిన విద్యా సామర్థ్యాలు అందించండని ప్రభుత్వాన్ని నిలదీద్దాం. ఒకటికి పది గొంతుకలు కలుపుదాం, పది చోట్ల గొంతులు విప్పుదాం. పాఠశాలల్లో పిల్లలకు నిర్దేశించిన విద్యా సామర్థ్యాలు అందించకపోవడం అంటే సమాజంలో నూతన అసమానతలకు బీజం వేయడమే. నాణ్యమైన విద్య కోసం ఉద్యమించడం అంటే అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే అని గుర్తిద్దాం.

**తరగతివారీగా పిల్లలకు అందించాల్సిన సామర్థ్యాలు:**

**తెలుగు తరగతి 1**

1. అక్షరాలను గుర్తుపట్టి చదవగలగాలి.
2. పదాలలోని అక్షరాలను గుర్తుపట్టాలి.
3. పిల్లలు సరళ పదాలు, గుణింత పదాలు చదవగలగాలి, రాయగలగాలి.
4. ప్రతి అక్షరం మీద సరళ పదాలు చదవగలగాలి, రాయగలగాలి.
5. పదాలలోని అక్షరాలతోనే నూతన పదాలు రాయగలగాలి.

**తరగతి 2**

1. పదాలలో ఉన్నటువంటి అక్షరాలను మరియు గుణింతాల పదాలను గుర్తుపట్టగలగాలి.
2. ద్విత్వాక్షరాలతో కూడినటువంటి పదాలు చదవాలి, రాయగలగాలి.
3. సంయుక్తాక్షరాలతో కూడిన పదాలు రాయగలగాలి.
4. సంశ్లేషణ అక్షరాలతో కూడిన పదాలు రాయగలగాలి, చదవాలి.

**తరగతి 3**

1. పిల్లలు గేయాలు రాగంతో పాడగలగాలి, అభినయం చేయగలగాలి.
2. తప్పులు లేకుండా రాగంతో పాడగలగాలి.
3. గేయాలకు అర్థం చెప్పగలగాలి.
4. కథలు, వ్యాసాలు అర్థం చేసుకొని సొంతంగా చెప్పగలగాలి.
5. సందర్భానుసారంగా భాషను ఉపయోగించాలి. పదాలకు అర్థాలు చెప్పగలగాలి.
6. పదాలు, వాక్యాలు తప్పులు లేకుండా స్పష్టంగా పలకగలగాలి.
7. వ్యక్తుల గురించి పాఠాలలోని పాత్రల గురించి తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.
8. వివిధ సన్నివేశాలలో సందర్భోచితంగా సరైన భాషను ఉపయోగించగలగాలి.
9. చదివిన అంశం అర్థం చేసుకోగలగాలి.
10. సొంత మాటలతో చెప్పగలగాలి, రాయగలగాలి.
11. వివిధ రూపాలలో ఉన్న బాలసాహిత్యాన్ని ధారాళంగా చదవగలగాలి, అర్థం చేసుకొని చెప్పగలగాలి.
12. సూచనల ఆధారంగా చిత్రం గీసి రంగులు వేయగలగాలి.

**తరగతి 4**

1. పదాలతో వాక్యాలు పూర్తిగా రాయగలగాలి. అర్థమయ్యే విధంగా ఉండగలగాలి.
2. పదాల ద్వారా సొంతంగా వాక్యాలు చదవగలగాలి, రాయగలగాలి.
3. ఏదేని ఒక కథ సారాంశం సొంతంగా చెప్పగలగాలి మరియు చదివి రాయగలగాలి.
4. చర్చలలో పాల్గొని, తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.
5. బాల సాహిత్యం, వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, అపరిచిత అంశాలను చదవగలగాలి, అర్థం చేసుకోగలగాలి.
6. సూచనలకు అనుగుణంగా చిత్రాలు గీయగలగాలి, రంగులు వేయగలగాలి, వాటి గురించి రాయగలగాలి.
7. మాస్కులు తయారుచేయటం, మట్టితో బొమ్మలు చేయగలగాలి. రంగులు వేయగలగాలి, ప్రదర్శింప చేయగలగాలి.
8. తోటివారు మహిళలు ఇతర వర్గాలు, ఇతర సంస్కృతులు, సేవలు చేసిన వారిని ప్రశంసించగలగాలి.

**తరగతి 5**

1. కథలు, సంభాషణలు, వార్తలు చదివి అర్థం చేసుకొని వాటి సారాంశం సొంతంగా క్రమ పద్ధతిలో చెప్పగలగాలి.
2. ఏదేని ఒక కథను ఊహించి చెప్పి, రాయగలగాలి. కనీసం 8 నుండి 10 వాక్యాలు రాయగలగాలి.
3. ఒకటి రెండు పేరాలు తప్పులు లేకుండా స్పష్టంగా రాయగలగాలి.
4. ఇచ్చిన పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలగాలి. కథలు, గేయాలను పొడిగించగలగాలి, సొంతంగా రాయగలగాలి.
5. ఏకపాత్రాభినయాలు మరియు నాటకీకరణ చేయగలగాలి. సూచనలకు అనుగుణంగా చిత్రాలు గీయగలగాలి, రంగులు వేయగలగాలి, వాటి గురించి రాయగలగాలి.
6. పోస్టర్, అభినందన పత్రాలు, ఆహ్వాన పత్రాలు, గ్రీటింగ్ కార్డ్స్, మాస్కుల నమూనాను తయారు చేయగలగాలి.
7. తోటివారు, మహిళలు, ఇతర సంస్కృతులు, సేవలు చేసినవారిని ప్రశంసించాలి. వాక్యనిర్మాణాన్ని, వాక్యాల రకాలను గుర్తించగలగాలి.

**ఇంగ్లీష్ తరగతి 1**

సంభాషణలు పొడిగించగలగడం, వర్ణించడం, పాడటం, సంభాషించడం, అలాగే పదాలు గుర్తుపట్టి చదవగలగడం, రాయగలగడం చేయగలగాలి.

1. వస్తువులు, వ్యక్తులు, స్థలాల గురించి వర్ణించగలగాలి.
2. వారి ఇష్టాలు, అయిష్టాల గురించి అవసరాల గురించి చెప్పగలగాలి.
3. ఒక కథ లేదా సంఘటన గురించి చెప్పగలగాలి.
4. పాట లేదా పద్యంలో కనీసం ఒక పదం పొడిగించగలగాలి.

**తరగతి 2**

సంభాషణలు పొడిగించగలగడం, వర్ణించడం, పాడటం, సంభాషించడం, అలాగే పదాలు గుర్తుపట్టి చదవగలగడం, రాయగలగడం చేయగలగాలి.

1. వస్తువులు, వ్యక్తులు, స్థలాల గురించి వర్ణించగలగాలి.
2. వారి ఇష్టాలు అయిష్టాల గురించి, అవసరాల గురించి చెప్పగలగాలి.
3. ఒక కథ లేదా సంఘటన గురించి చెప్పగలగాలి.
4. పాట లేదా పద్యంలో కనీసం ఒక పదాన్ని పొడిగించగలగాలి.

**తరగతి 3**

సంభాషణలు పొడిగించగలగడం, వర్ణించడం, పాడడం, సంభాషించడం, అలాగే పదాలు గుర్తుపట్టి చదవగలగడం, రాయగలగడం చేయగలగాలి.

1. వస్తువులు, వ్యక్తులు, స్థలాల గురించి వర్ణించగలగాలి.
2. వారి ఇష్టాలు అయిష్టాల గురించి, అవసరాల గురించి చెప్పగలగాలి.
3. ఒక కథ లేదా సంఘటన గురించి చెప్పగలగాలి.
4. పాటలు, గేయాలకు అభినయం చేయగలగాలి.
5. సూచనలు చేయడం గ్రహించగలగాలి.
6. నినాదాలు తయారుచేయగలగాలి.
7. పోస్టర్ చేయగలగాలి. 8. సందేశాలు చేయగలగాలి.

**తరగతి 4**

సంభాషణలు పొడిగించగలగడం, వర్ణించడం, పాడడం, సంభాషించడం, అలాగే పదాలు గుర్తుపట్టి చదవగలగడం, రాయగలగడం చేయగలగాలి.

1. వస్తువులు, వ్యక్తులు, స్థలాల గురించి వర్ణించగలగాలి.
2. వారి ఇష్టాలు, అయిష్టాలు, ఇతర అవసరాల గురించి చెప్పగలగాలి.
3. ఒక కథ లేదా సంఘటన గురించి చెప్పగలగాలి.
4. పాటలు, గేయాలకు అభినయం చేయగలగాలి.
5. సూచనలు చేయడం, గ్రహించగలగడం ఉండాలి.
6. నినాదాలు తయారు చేయగలగాలి.
7. పోస్టర్ చేయగలగాలి.
8. సందేశాలు చేయగలగాలి.

**గణితం తరగతి 1**

1. 0-99 వరకు సంఖ్యాభావన (లెక్కించడం, గుర్తించడం, రాయడం చేయగలగాలి).
2. ముందు, తర్వాత, మధ్య సంఖ్యలను గుర్తించగలగాలి.
3. ఆరోహణ, అవరోహణ క్రమంలో రాయగలగాలి.
4. 99 వరకు సాధారణ కూడిక.
5. 99 వరకు సాధారణ తీసివేత.

**తరగతి 2**

1. 999 వరకు సంఖ్యా భావన (లెక్కించడం, గుర్తించడం, రాయడం ఉండాలి).
2. ముందు, తర్వాత, మధ్య సంఖ్యలను గుర్తించగలగాలి.
3. ఆరోహణ అవరోహణ, స్థాన విలువలు గుర్తించగలగాలి.
4. కూడికలు, ఎత్తికూడే పద్ధతిలో కూడికలు, స్థానమార్పిడి తీసివేతలు, గుణకార భావన, భాగాహార ప్రాథమిక భావన కలిగిఉండగలగాలి.

**తరగతి 3**

1. సంఖ్యా భావన (లెక్కించడం, గుర్తించడం, రాయడం చేయగలగాలి).
2. ముందు, తర్వాత, మధ్య సంఖ్యలను గుర్తించడం, ఆరోహణ అవరోహణ, స్థాన విలువలు సంక్షిప్త రూపంలో రాయగలగాలి.

3 కూడికలు (3 అంకెలు), తీసివేతలు (3 అంకెలు).

4. గుణకారాలు, భాగాహారాలు, జ్యామితీయ భావనలు.
5. కొలతలు, అవగాహన.
6. దత్తాంశ నిర్వహణ అవగాహన, చతుర్విద ప్రక్రియలో తప్పులను గుర్తించ గలగాలి.
7. చతుర్విద ప్రక్రియలో నూతన సమస్యలు రూపొందించడం, వివిధ పద్ధతులలో సమస్యలు సాధించడం.

**తరగతి 4**

**సంఖ్యాభావన:**

1. చతుర్విధ ప్రక్రియల మధ్య సంబంధాలు గుర్తించగలగాలి.
2. కూడిక, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు, రాత లెక్కలు చేయగలగాలి.
3. భిన్నాలు, భావన.
4. శాతాలు, నిష్పత్తులు, భావన.
5. పొడవు, బరువు, ఘనపరిమాణం, సమయం మరియు వైశాల్యం వంటి వాటిలో చతుర్విద ప్రక్రియలు చేయగలగాలి.

**తరగతి 5**

సంఖ్యాభావన:

1. చతుర్విధ ప్రక్రియల మధ్య సంబంధాలు గుర్తించగలగాలి.
2. కూడిక, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు, రాతలెక్కలు చేయగలగాలి.
3. భిన్నాలు, భావన.
4. శాతాలు, నిష్పత్తులు, పొడవు, బరువు, ఘనపరిమాణం, సమయం మరియు వైశాల్యం వంటి వాటిలో చతుర్విద ప్రక్రియలు చేయగలగాలి.
5. అమరికలు, భావన, ఆకారాలు, ఆకృతులు అవగాహన

**(విద్యా సామర్థ్యాల సాధన ఉద్యమం, సికింద్రాబాద్)**

**పిల్లలందరూ నేర్చుకోగలరు**

పిల్లలకు నేర్పించే బాధ్యత పాఠశాల, ప్రభుత్వాలదే

పిల్లల అభ్యసన ప్రగతిని నిరంతరం, సమగ్రంగా పర్యవేక్షిస్తూ వారి అవసరాలకు తగిన విధంగా పాఠశాల వ్యవహరించాలి

అన్నిటికీ మించి పిల్లల భాగస్వామ్య హక్కును గుర్తించి, మర్యాదాపూర్వక వాతావరణంలో వారి వ్యక్తీకరణకు, సృజనాత్మకతకు వీలు కల్పించాలి.

# పఠనాసక్తిని పెంచేందుకు..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో విద్యా సంక్షోభానికి కొవిడ్ మహమ్మారే కారణమని చెప్పటం ఆత్మవంచన అవుతుంది. కొవిడ్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తాయి తప్ప.. దాని వల్లే మన విద్యా వ్యవస్థ దెబ్బతినలేదు. విద్యలో తెలుగు రాష్ట్రాల్లో, మిగతా దేశంలో ఘోరవైఫల్యం కొవిడ్‌కు ముందు నుండి దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది.

తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతివారూ మాతృభాషలో, ఆంగ్లంలో పదాలు వాక్యాలను చదవలేకపోతున్నారని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2021 మాత్రమే కాదు.. అంతకుముందు సర్వేలు కూడా చెప్పాయి.

కొవిడ్‌కు ముందు ఎంవీ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 5-10 తరగతుల విద్యార్థులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. మొత్తం 9,947 మంది విద్యార్థులకు రెండు పుటల ప్రశ్నాపత్రాన్ని ఇచ్చి జవాబులు రాయమన్నారు. అందులో 20 శాతం మంది మాత్రమే సరిగా చదివి, రాయగలిగారు.

అసర్ డేటా ప్రకారం.. మూడవ తరగతి విద్యార్థుల్లో 77.6 శాతం, ఐదవ తరగతి విద్యార్థుల్లో 52.2 శాతం, రెండో తరగతి పాఠ్యపుస్తకాలను చదవలేకపోతున్నట్లు తేలింది. అలాగే మూడో తరగతి విద్యార్థుల్లో 78.9 శాతం మంది ఒకటో తరగతి పుస్తకాలను చదవలేకపోతున్నారు.

.. ఈ నేపథ్యంలో యూనియన్ ప్రభుత్వం 'రీడ్' కార్యక్రమం పేరుతో ఒక ముందడుగు వేసింది.

పాఠశాల పిల్లల్లో చదవడాన్ని అలవాటుగా మార్చటానికి జాతీయ స్థాయి ప్రభుత్వం 100 రోజుల పఠన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది.

చదువు..ఆనందించు..అభివృద్ధి చెందు (రీడ్: రీడ్-ఎంజాయ్-డెవలప్) అనే పేరిట తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 5 నుండి అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో ఒకటి నుండి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని గత విద్యా సంవత్సరం ముగిసే వరకు అమలు చేశారు.

పాఠ్య పుస్తకాల్లోని పాఠాలతోపాటు పాఠ్యేతర పుస్తకాలు, కథలు, వార్తా పత్రికలు వంటివి తప్పులు లేకుండా వేగంగా చదవాలన్నది కార్యక్రమ లక్ష్యంగా ముఖ్య మార్గదర్శక సూత్రాల్లో పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులందరూ దీని నిర్వహణలో భాగస్వాములు. ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహిస్తారు. ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడూ ప్రతిరోజూ తప్పనిసరిగా తాము బోధించే పాఠ్యాంశాన్ని 10 నిమిషాల పాటు చదివించాలి. అందులో కీలక పదాలను గుర్తించేలా చేసి బ్లాక్‌బోర్డుపై లేదా చార్టుల మీద రాయాలి. తద్వారా పిల్లలకు చదవటం అలవాటుగా మారుతుంది. గ్రంథాలయ పుస్తకాలను



పిల్లలతో చదివించేందుకు ప్రతి రోజూ ఒక కాలాంశాన్ని కేటాయించాలి. ఇంటి వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలతో కథల పుస్తకాలు, వార్తా పత్రికలు చదివించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. అన్ని పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలను జరపాలని, పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని మార్గదర్శకాలతో తెలిపారు.

అంతకుముందు 2019-20లోనే ఈ కార్యక్రమాన్ని 'చదవడం మాకిష్టం' (వియ్ లవ్ రీడింగ్) పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మూడు నుంచి తొమ్మిది తరగతి విద్యార్థులు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడాదిపాటు ప్రత్యేక కార్యక్రమంగా దీని అమలు ప్రారంభించారుగానీ.. కొవిడ్ కారణంగా మధ్యలో అవరోధాలు ఏర్పడ్డాయి.

చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములు చేసి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చే ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థులకు అందుబాటులో వివిధ పుస్తకాలు ఉంచాలని నిర్దేశించారు. పర్యవేక్షణకు కమిటీలను ఏర్పాటు చేసి, పఠనానికి ప్రత్యేక పీరియడ్లు కేటాయించారు. ప్రతి పాఠశాలలో బేస్ లైన్ పరీక్ష నిర్వహించి, పుస్తక పఠనానికి విద్యార్థులను నాలుగు భాగాలుగా గుర్తించాలని మార్గదర్శకం జారీ చేశారు. కొన్ని తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించి ఫలితాలు కూడా వెలువరించారు. ఈ రకంగా పిల్లలు చదివేదాన్ని బట్టి నాలుగు స్థాయిల్లో వర్గీకరించారు. తర్వాత తదనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇచ్చిన పేరా అర్థవంతంగా, ధారళంగా చదివే వారిని లెవెల్-4, కేవలం వాక్యాలు మాత్రమే చదవగలిగితే లెవెల్-3, పదాలు చదవగలిగితే లెవెల్-2గా, అక్షరాలు చదవగలిగితే లెవెల్-1గా గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. పుస్తక పఠనానికి ప్రతి తరగతికి రోజుకు రెండు పీరియడ్లు కేటాయించారు. వీటిని తరగతి గది ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని చెప్పారు. వివిధ స్థాయిల్లో పర్యవేక్షణకు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా, ఎస్-

ఎస్ఎపిఓ కో కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్‌తో కూడిన కమిటీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుందని తెలిపారు. మండల స్థాయిలో ఎంపిడిఓ చైర్మన్‌గా, ఎంఇఓ కన్వీనర్‌గా, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కో కన్వీనర్‌గా, పలువురు సభ్యులతో కూడిన కమిటీ పర్యవేక్షిస్తుంది. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి చైర్మన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, ప్రజాగ్రంథాలయాధికారి సభ్యుడిగా, పాఠశాల స్థాయిలో తరగతి గది ఉపాధ్యాయుడు, ఇద్దరు బాలురు, బాలికతో కూడిన కమిటీలు పాఠశాల గ్రంథాలయాన్ని, చిన్నారుల పుస్తక పఠనాన్ని పర్యవేక్షించేలా కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.

విద్యార్థులకు వాక్యాల నుండి గ్రంథాల దాకా చదివే శక్తిని కల్పించడం, కథలు, పత్రికలు, జీవిత చరిత్రలు, వైజ్ఞానిక విశేషాలు తదితర అన్ని రంగాలకు చెందిన పుస్తకాలను స్కూళ్ల గ్రంథాలయంలో ఏర్పాటు చేయడం, విద్యార్థుల్లో చదివే అభిరుచి అలవాటు చేసి చదవటంలోని ఆనందాన్ని పరిచయం చేయడం ద్వారా పిల్లల్ని పుస్తకలోకంలోకి ఆహ్వానించి ఊహాలోకాలలోకి రెక్కలు విచ్చుకునే అవకాశం కల్పించగలమని భావించారు.

విద్యా సంవత్సరం ముగిసేనాటికి విద్యార్థులందరూ వారి స్థాయికి తగిన అంశాలను ధారాళంగా చదవగలగాలి. చదవటం ఒక అలవాటుగా మారాలి. విద్యార్థులు స్వతంత్ర పాఠకులుగా ఎదగాలి..అని తెలంగాణలో 'రీడ్' లక్ష్యంగా నిర్దేశించారు.

అయితే అసలు ఆ కార్యక్రమం ఎలా జరిగిందో, ఫలితాలు ఏమిటో మదింపు చేసి ప్రజల ముందు ఉంచలేదు.

పరీక్షలు, ఏపీలో పదవ తరగతి పరీక్షల లీకేజీ, ఫలితాలపై తీవ్ర విమర్శలు, కొత్త విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు వంటి అంశాల్లో ఈ కార్యక్రమంపై సమీక్ష మరుగున పడిపోయింది.

కొవిడ్ సమయంలో మన ప్రభుత్వాలు అశాస్త్రీయ నిర్ణయాలు తీసుకుని, బడులను నెలల తరబడి మూసి ఉంచటంతో అసలే అంతంతమాత్రంగా ఉన్న బోధనా ప్రక్రియ కుంటుపడిందనటంలో సందేహం లేదు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బోధనను మిళితం చేసి సమర్థవంతమైన హైబ్రిడ్ పద్ధతిలో విద్యాబోధనను అమలు చేయటంలో ప్రభుత్వాలు ఇప్పటికీ విజయం సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే.. ఉన్న కాస్తా సమయమూ చదివించటం వంటి కార్యక్రమాలకే వెచ్చిస్తుండటం వల్ల పాఠ్యాంశాల్ని బోధించలేకపోతున్నామని పలువురు ఉపాధ్యాయులు రీడ్ కార్యక్రమం ప్రారంభిస్తున్నప్పుడు ఆందోళన వ్యక్తం చేశారు. బోధనేతర పనుల భారం, పరీక్షలు ఎలా రాసినా పాస్ చేసేస్తారని విద్యార్థులు భావిస్తుండటాల్ని కూడా వాళ్లు ఏకరువు పెట్టారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్షల ఫలితాలు ఉపాధ్యాయుల భయాలను నిజం చేసినట్లు కనిపిస్తున్నా, నాణ్యమైన పాఠశాల విద్య దిశగా విద్యార్థులను పట్టాలెక్కించే అవకాశంగానే పఠన కార్యక్రమాన్ని పరిగణించటం సమగ్ర, వాస్తవిక దృక్పథమనిపించుకుంటుంది.

పేరు ఏదైనా పఠన కార్యక్రమం పాఠశాల విద్యావ్యవస్థలో భాగమవ్వాలి. ప్రభుత్వాలు ఏ రూపంలో అమలు చేసినా.. పఠన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామస్థాయిలో ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయిలో మండల విద్యాశాఖాధికారులు తగిన పర్యవేక్షణ చేయాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను పుస్తక పఠనం పట్ల ప్రోత్సహించాలి. తద్వారా మంచి పుస్తకాలను చదివే అవకాశం విద్యార్థులకు కలుగుతుంది. జిజ్ఞాస పెరుగుతుంది. మంచి జ్ఞానం కలుగుతూ మనోవికాసానికి బాటలు ఏర్పడతాయి. విద్యార్థులు వివిధ భాషలపై పట్టు సాధించగలుగుతారు. తరగతి చదువులూ గాడిన పడతాయి. పరీక్షలలో రాణించడానికి సైతం పఠనాసక్తి ఉపయోగపడుతుంది.

పుస్తకాల్ని చదవటం వల్ల ఉన్నచోటు నుంచే ప్రపంచాన్ని ఆకళింపు చేసుకునే అవకాశం వస్తుంది. ఒత్తిడి తగ్గి మానసిక ఆరోగ్యం పెరుగుతుంది. పుస్తకాలు సమాజానికి వికాసాన్ని, విజ్ఞానాన్ని అందిస్తాయి. మనిషిలోని భావాలకు, ఊహలకు అక్షరరూపం ఇచ్చి కవులుగా, రచయితలుగా, శాస్త్రవేత్తలుగా, సాహితీవేత్తలుగా, మేధావులుగా, రాజనీతిజ్ఞులుగా, గొప్ప పౌరులుగా తీర్చిదిద్దుతాయి. జీవితాన్ని తీర్చిదిద్దే పుస్తక పఠనాన్ని అందరూ అలవాటు చేసుకోవాలి. ❖

## పాఠ్య పుస్తకాలు మాత్రమే చదివే ధోరణి మారాలి

మన దేశంలోని విద్యార్థులు ఎక్కువగా పాఠ్య పుస్తకాలు మాత్రమే చదువుతుండటం కూడా కొవిడ్ ముందు నుండీ ఉన్న సమస్యే. ఇతర రచనలు, సామాజిక, రాజకీయ, ఆర్థిక సంబంధ పుస్తకాలు చదవడం తగ్గుతున్నది. రిఫరెన్స్ బుక్స్ కూడా చదవడం తగ్గుతున్నది. కొవిడ్ వచ్చాక చిన్న పిల్లల దగ్గర్నుండి అందరూ టీవీ, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్‌కు అలవాటుపడటంతో ఇతరత్రా పఠనం ఇంకా తగ్గిపోతున్నది. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచే చదివే అలవాటు చేయటానికి బొమ్మల కథలతో కూడిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. చదివేలా చూడాలి. పిల్లల్లో సృజనాత్మకత కోసం, భావ వ్యక్తీకరణ కోసం పుస్తక పఠనం దోహదపడుతుంది. పాఠశాలల్లో పుస్తకాలు చదవడం, వాటిని విశ్లేషించటం, సమీక్షలు రాయటం వంటివి చేయించాలి. పుస్తక రచయితలను, ఆలోచనాపరులను విద్యాలయాలకు పిలిపించి పిల్లలతో ముఖాముఖి ఏర్పాటు చేయించాలి. పిల్లలు తాము తెలుసుకోవాల్సిన అంశానికి సంబంధించిన అన్ని రకాల పుస్తకాలను చదవాలి, విశ్లేషించాలి. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలి. పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. ప్రతి స్కూల్లో పిల్లలకు ఇష్టమైన విజ్ఞానాన్ని పంచే పుస్తకాలు ఉంచాలి.

# 'మహా' భారతం..

## ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికే పరిష్కారం




మన పాలనా వ్యవస్థలోని సంక్షోభానికి మూలం రాష్ట్రాల్లోని మన ఎన్నికల వ్యవస్థలో ఉందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. చట్టసభలో చర్చించి పరిష్కారాల కోసం శాసనాలు చేయాల్సిన ఎమ్మెల్యేలు రోజువారీ పాలనలో జోక్యం చేసుకుంటున్నారని, నియోజకవర్గంలో వారికి తెలియకుండా ఏ పనీ జరగకూడదని హుకుం జారీ చేస్తున్నారని, ఈ ఎమ్మెల్యేరాజ్యం అనేక జాడ్యాలకు కారణమవుతోందన్నారు. తాము ఎన్నికల్లో గెలవాలంటే అనధికార వసూళ్లు, ట్రాన్స్‌ఫర్లు, పోలీసు కేసుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో పలుకుబడి తప్పదని ఎమ్మెల్యేలు వాదిస్తుండగా, ఈ ఎమ్మెల్యేల మీద ఆధారపడినందున ప్రజలకు అనుకున్నంత మంచి చేయలేకపోతున్నామని, అవినీతి పట్ల నిస్సహాయులమవుతున్నామని ముఖ్యమంత్రులు వాపోతున్నారన్నారు. ప్రజలకు మంచి పాలన అందించిన ముఖ్యమంత్రులు కూడా ఎమ్మెల్యేలను పట్టించుకోకపోతే వారి మద్దతును కోల్పోయి గద్దె దిగాల్సి వస్తోందన్నారు. మహారాష్ట్రలో శివసేన ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేపై తిరుగుబాటు మరోసారి ఈ సంక్షోభాన్నే దేశం ముందుకు తెచ్చిందన్నారు. బీజేపీతో కలిసి పోటీ చేసి సీట్లు పొందిన శివసేన ఆ తర్వాత కాంగ్రెస్, ఎన్‌సీపీ, ఇతరులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఒక రకంగా ప్రజల తీర్పుని వమ్ము చేయటం కాగా, తాజా అధికార క్రీడ మరో రకంగా ప్రజాభిప్రాయాన్ని కాలరాయటమన్నారు. ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకోవటమే ఇందుకు పరిష్కారమన్నారు. మన దేశంలో పాలన, రాజకీయం ప్రధానంగా రాష్ట్రాల్లో ఉంటుందని, ఇక్కడ రోజువారీ పాలన సక్రమంగా జరగాలంటే ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా ప్రభుత్వం నడవగలగాలన్నారు. కానీ రాష్ట్రం తర్వాత రాష్ట్రం అధికార క్రీడతో అస్తవ్యస్తమవుతున్నాయన్నారు. అందుకే గుడ్డిగా బ్రిటన్ వెస్ట్ మినిస్టర్ పద్ధతిని అనుసరించకుండా.. మన దేశ పరిస్థితులకనుగుణంగా రాష్ట్రాధినేతల్ని (ముఖ్యమంత్రుల్ని) ఎమ్మెల్యేలు ఎన్నుకునేరీతిలో కాకుండా ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల డబ్బు ప్రభావం క్రమంగా తగ్గటమే కాకుండా, ప్రభుత్వం సక్రమంగా పాలన చేయగలుగుతుందన్నారు. ప్రభుత్వం అదుపుతప్పకుండా ఎమ్మెల్యేలు చట్టసభ ద్వారా నియంత్రిస్తుంటారని, స్థానిక ప్రభుత్వాలు కూడా బలపడతాయన్నారు. ఎన్నో రకాల వైవిధ్యమున్న మన దేశంలో ప్రధానమంత్రిని నేరుగా ఎన్నుకోవటం కొన్ని సమస్యలకు దారితీసే అవకాశముంది కాబట్టి.. జాతీయ స్థాయిలో వెస్ట్ మినిస్టర్ పద్ధతిని యథాతథంగా కొనసాగించవచ్చన్నారు. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికవల్ల కేసీఆర్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మమతా బెనర్జీ, స్టాలిన్ వంటి నేతలకు కూడా లాభమేనని, యూనియన్ ప్రభుత్వం తలచుకుంటే వెంటనే ఈ సంస్కరణను అమల్లోకి తెచ్చేయొచ్చని జేపీ తెలిపారు.



## మాదక ద్రవ్యాలను అరికట్టాలి

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చట్టాలను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయరాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు డిమాండ్ చేశారు. భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉదాసీన వైఖరితోనే రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం పెరిగిందన్నారు. విచ్చల విడిగా లభిస్తున్న మాదక ద్రవ్యాలతో యువత నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమాజం మేల్కొని యువతను మాదక ద్రవ్యాల నుంచి బయట పడేయాలన్నారు. సమావేశంలో కాచరాజు జయప్రకాశ్‌రావు, రామ్మూర్తి, కోడారి వెంకటేష్, ముత్తిరెడ్డి, వైజయంతి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ విజయాల్ని భారతదేశ విజయాలుగా మార్చాలి: జేపీ




బీజేపీ ఎన్నికల విజయాలు భారతదేశ విజయాలుగా మారితేనే సార్థకత అని, అందుకు ఆ పార్టీ ఇంకా చాలా దూరంలో ఉందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ రాసిన వ్యాసాల సంకలనం 'సత్యకాలమ్' పుస్తకాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, సీనియర్ ఎడిటర్ రామచంద్రమూర్తి, ఎమెస్కో కంటెంట్ హెడ్ జి.వల్లీశ్వర్, రచయిత, జేపీతో కలిసి యూనియన్ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి భూపేందర్ యాదవ్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.

సిద్ధాంతాలను పక్కనపెడితే, రాజకీయాలకు ఆచరణలో కొన్ని నిర్దిష్ట ప్రమాణాలుండాలని జేపీ అన్నారు.

మొదటిది, ఆసక్తి, సామర్థ్యంతో ప్రజాజీవితంలోకి రావాలనుకునే పౌరులందరికీ అవకాశమిచ్చే వేదికగా రాజకీయ పార్టీ పనిచేయాలన్నారు. ఈ ప్రమాణం ప్రకారం బీజేపీ మెరుగ్గానే ఉందని, సామాన్యులకు కూడా అవకాశాలనిస్తోందన్నారు. మిగతా చాలా పార్టీల్లో పైవారి ఆశీస్సులో, అండో లేకుంటే, లేదా పైవారి ముందు తలొగ్గకుంటే సరైన అవకాశాలు లభించవన్నారు.

రెండోది, ఒక పార్టీలో, దేశంలో రాజకీయంగా ఎదగటానికి డబ్బు పంచటం, ప్రజలను చీల్చటం, ఉచితాలను ఎర వేయటం, తాత్కాలిక అవసరాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను పణంగా పెట్టటం వంటివి లేకుండా హేతుబద్ధ, నైతిక పద్ధతులను నేతలు అవలంబించాలన్నారు.

మూడోది, పార్టీ నిర్మాణాత్మక, హేతుబద్ధ ప్రత్యామ్నాయ ఎజెండాను ప్రజల ముందుంచాలన్నారు.

చివరిగా, అధికారంలోకి వచ్చాక ఆ హామీల్ని అడ్డుగోడలు లేకుండా, పారదర్శకంగా, నాణ్యమైనరీతిలో ప్రజలకు నెరవేర్చాలన్నారు.

.. మొత్తంగా చూస్తే ఈ ఆచరణాత్మక ప్రమాణాలను నెరవేర్చటంలో బీజేపీ ఇప్పటికీ విజయం సాధించలేదని జేపీ తెలిపారు. బండి సంజయ్ ఎంతో కష్టపడి పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్రాన్నే తీసుకుంటే, ఒక ఉప ఎన్నికలో గెలుపు కోసం ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో, ఏమేమి పంచారో తెలంగాణలో, ఏపీలో అందరికీ తెలుసన్నారు.

మన ప్రభుత్వం, మీ పార్టీ (బీజేపీ) ఈ లక్ష్యాలను నెరవేర్చకపోతే ఎన్నికల్లో మీరు గెలుస్తుంటారు తప్ప భారతదేశం గణనీయంగా నష్టపోతూనే ఉంటుంది.. అని జేపీ అన్నారు. కొత్త రాష్ట్రపతి ఎవరు, ఉపాధిలేక ఆందోళనలు చేస్తున్న యువతను ఏదోకరకంగా శాంతింప చేయటం ఎలా వంటి సవాలక్ష సాంకేతిక, రోజువారీ అంశాల చుట్టూనే కాలం దొర్లిపోతుంటుందన్నారు.

ఎన్నికల్లో కనీస పోటీ ఇవ్వాలంటే అసెంబ్లీకి 30–50 కోట్లు, లోక్‌సభకు 50–100 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి దేశంలోని పలు నియోజకవర్గాలలో ఉందని, మిగిలిన చోట్ల కూడా డబ్బు ప్రభావం ఉన్నకొద్దీ పెరుగుతోందని జేపీ అన్నారు. రాజకీయం పవిత్ర

**కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రతిపక్షం లేకుండా ఒకే పార్టీతో దేశాన్ని నడపాలని తాము కోరుకోవటం లేదని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పార్టీ బీజేపీ అన్నారు. దేశంలో పేదరిక నిర్మూలనకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏదైనా విషయం చెప్పటం కన్నా రాయటం ఎక్కువ కష్టమని సత్యకుమార్ కృషిని ప్రశంసించారు.**

వ్యాసంగమని మర్చిపోయి, అధికారం చుట్టూ రాజకీయానికి బానిసలుగా మారిపోయామన్నారు. మనకు నచ్చిన పార్టీ, నాయకుడు ఏం చేసినా రైటు .. అవతలివాళ్లు ఏం చెప్పినా, ఏం చేసినా తప్పు .. మనల్ని వ్యతిరేకించేవాళ్లు దేశద్రోహులు వంటి ధోరణులు ప్రబలుతున్నాయన్నారు. నిన్న, మొన్న కూడా ఇందుకు ఉదాహరణలు చెప్పవచ్చున్నారు. ప్రజల తీర్పుతో సంబంధం లేకుండా నేతలు పార్టీలు మారటం, ప్రభుత్వాల్ని ఏర్పాటు చేయటం జరుగుతోందన్నారు. ఈ పరిస్థితిని ఇలాగే కొనసాగిస్తే చరిత్ర మన పట్ల కఠినమైన తీర్పునిస్తుందన్నారు. డబ్బున్నవారు, లేనివారు, ఈ కులం, ఆ మతం, ప్రాంతం, భాష తేడా లేకుండా మనందరి లక్ష్యం మన పిల్లలకు మంచి భవిష్యత్తునందించటమేనని, బానిస రాజకీయం వల్ల ఆ లక్ష్యానికి మనమే అవరోధంగా మారుతున్నామన్నారు.

సమీప ప్రత్యర్థి పార్టీలతో పోల్చుకుని దిగజారుడు ప్రమాణాలను ఏర్పరచుకుంటే, బీజేపీ కూడా కాలక్రమంలో దిగజారిపోయే ప్రమాదముందని, అత్యుత్తమ ప్రమాణాలను రాజీ లేకుండా అనుసరించటమే బీజేపీ సుస్థిర మనుగడకు మార్గమని జేపీ అన్నారు. ఆర్థిక వృద్ధితోపాటు రాజకీయ పరివర్తన కూడా దీర్ఘకాలంలో ప్రజాస్వామ్యానికి సమానా వసరమన్నారు. ప్రజాస్వామ్యమే అక్కర్లేదని పొరుగున ఉన్న బలమైన ఆర్థిక శక్తి చైనా వాదిస్తోందని, ప్రజాస్వామ్యం బదులు నియంతృత్వం మేలనే ధోరణి మన దేశంలో కూడా మెజారిటీవాదమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారతదేశానికి ఇప్పుడు మౌలికమైన మార్పు కావాలని, ఈ మార్పును తీసుకొచ్చేందుకు బీజేపీకి వెలకట్టలేని అవకాశం లభించిందని జేపీ పేర్కొన్నారు. ఇప్పుడున్న స్థాయి కంటే ఎన్నో రెట్లు ఎదిగే సామర్థ్యం, అవకాశం ఇండియాకి ఉన్నాయని, వాటిని వెలికి తీయటానికి సమయం మించిపోకుండా వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకత్వం ఈ పని చేయగలిగితే, డెంగ్ జియావోపింగ్‌లా చరిత్రలో నిలిచిపోతారన్నారు.

మన దేశభక్తి ఒక సంస్థ, పార్టీ, నాయకుడి కంటే ఎక్కువని గుర్తించాలని, మోదీ ప్రభుత్వం, బీజేపీ, ఇతర పార్టీలు, సంస్థలు, నేతలు కూడా భారత్‌ను గెలిపించేందుకు విభేదాలకతీతంగా పనిచేయాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

సత్యకాలమ్ గురించి మాట్లాడుతూ, సత్యకుమార్ నిర్దిష్ట సమాచారాన్ని సేకరించి స్పష్టంగా అర్థమయ్యేలా, తేలిగ్గా చదవగలిగేలా వ్యాసాలు రాశారని జేపీ అభినందించారు. ఆయన ఆలోచనల్ని, మన ప్రభుత్వం, వారి పార్టీ పనితీరును తెలుసుకోవటానికి, రాజకీయ పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవటానికి సత్యకాలమ్ ఉపయోగపడుతుందన్నారు. సత్యకుమార్ మాతృభాష సాంకేతికంగా మరాఠీ అని, ఆరు తరాల కింద వారి కుటుంబం అక్కడ్నుంచి వలస వచ్చారని తనకు ఇప్పుడే తెలిసిందని, తన మాతృభాష కూడా సాంకేతికంగా మరాఠీయేనని జేపీ చెప్పారు.

సత్యకుమార్ అభిప్రాయాలతో మనం పూర్తిగా ఏకీభవించకపోవచ్చుని, కానీ నూరు శాతం ఏకాభిప్రాయం ఒకే ఇంట్లోని కుటుంబ సభ్యుల మధ్య కూడా ఉండదని, అలా ఉందంటే ఒకరికి ఇంకొకరు బానిసయినట్లని జేపీ అన్నారు. అభిప్రాయ భేదాలను దూషణలు, దాడులు, అడ్డగోలు వాదనలు, దౌర్జన్యాలు, ఆధిపత్యాలు లేకుండా వాస్తవాల ఆధారంగా పరిష్కరించుకోవటంలోనే ప్రజాస్వామ్య పురోగమనం ఉంటుందన్నారు. విరుద్ధ అభిప్రాయాలున్నా కచ్చితంగా కొన్ని ఏకీభవించే అంశాలుంటాయని.. ఇతరులతో ఏకీభవించే అంశం నుండి ప్రారంభమై, విభే దించే అంశాలపై చర్చిస్తూ ఉంటే క్రమంగా పరిష్కారంగా మధ్యేమార్గం దొరుకుతుందని మహాత్మాగాంధీ చెబుతుండే వారన్నారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడకుండా సత్య కుమార్ పాటించిన ప్రమాణాలు ఇతర పార్టీల్లోని వారికి కూడా ఆదర్శమన్నారు.

హైదరాబాదీలు, తెలంగాణ, తెలుగు ప్రజలు ఎవరినైనా ఆదరించే నైజం కలవారని, భాష, సంస్కృతుల పట్ల ఛాందసం లేనివారని, మిగిలిన దేశమంతటికన్నా ఎక్కువ జాతీయ భావాలు కలిగినవారని, ఇది తాను పూర్తి సాధికారతతో చెప్పగలనని.. ఇంగ్లిష్‌లో తన ప్రసంగాన్ని ప్రారంభించే ముందు మంత్రినుద్దేశించి జేపీ అన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందనరావు, బీజేపీ నేతలు డీకే అరుణ, వివేక్, సీఎం రమేష్, కామినేని శ్రీనివాస్, ఎంపీ రఘురామకృష్ణంరాజు, నాగార్జున, బండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు. ❖

# రాష్ట్ర రాజకీయాలకి జేపీ లాంటి వారి అవసరముంది

## లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి






ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు పరమ చెత్తగా, ఆందోళన కరంగా ఉన్నాయని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు, సుదీర్ఘ పరిపాలనా అనుభవం ఉన్న డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ లాంటి వారి అవసరం ఎంతైనా ఉందని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ సర్కిల్ ల్లో ఉన్న డాక్టర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకి పార్టీ నాయకులతో కలిసి పూలదండలు వేసి నివాళు లర్పించారు,పార్టీ కార్యాలయం వద్ద జెండా వందనం చేసిన అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు, రాష్ట్రంలో అధికారమే అంతిమ లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు, ప్రతిపక్ష పార్టీ ప్రజల తరపున ఒక్క పోరాటం కూడా చెయ్యకుండా వచ్చే ఎన్నికల్లో గెలవటమే అజెండగా పెట్టుకుందని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లేవని,కొత్త పరిశ్రమలు రాలేదని,వ్యవసాయం సంక్షోభంలో ఉండి రైతులు రోడ్డున పడ్డారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు ప్రజలను చైతన్య వంతులను చేసి అవినీతి,కుటుంబ రాజకీయాలు ఓడిపోయే స్థితికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

రైతులు పంటల విరామం ప్రకటించారంటే రాష్ట్రంలో పరిస్థితి ఎంత విషమంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని భీశెట్టి అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల పై రాష్ట్రంలో పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. లోక్ సత్తాపార్టీ నాయకులు పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. రాయలసీమ ప్రాంతాలైన కర్నూలు, కడప,అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పార్టీ ప్రచారం పై సమీక్ష నిర్వహించారు, ఈ సమావేశంలో పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరమణ(బాబు), కర్నూలు అధ్యక్షుడు కొత్తపల్లి ఆనందాచారి, పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు జయరాముడు, ఆలేరు పార్టీ అధ్యక్షుడు రాందాస్ గౌడ్,గుంతకల్లు పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్,దేవనకొండ పార్టీ నాయకుడు శేఖర్, పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై అఖిలపక్షం ఏర్పాటు చెయ్యాలి!

రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని కొంతమంది రైతులు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని రైతుల ఆత్మహత్యలు నివారించడానికి, రైతులకు ప్రభుత్వం అండగా ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చెయ్యాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. లోక్ సత్తాపార్టీ నాయకుల బృందం తో తాను రాయలసీమ ప్రాంతాల్లోని పలు నియోజకవర్గ రైతులతో సమావేశమై రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. రాయలసీమ రైతులతో పాటుగా పల్నాడు,పశ్చిమగోదావరి జిల్లాలోని రైతులు పంటలు పండక,గిట్టుబాటు ధరలు లేక , పంటల బీమా అందక అల్లాడుతున్నారన్నారు. వ్యవసాయశాఖ మంత్రి పనితీరును ఆయన విమర్శించారు. లోక్‌సత్తాపార్టీ నుండి ముఖ్యమంత్రి కి వివరాలతో కూడిన లేఖను రాశామని భీశెట్టి లేఖను విడుదల చేశారు.

# ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించే బాధ్యత ప్రభుత్వాలదే

**- డాక్టర్ సీహెచ్ జయశ్రీ**

ప్రజారోగ్యం విషయంలో రాజకీయ పరమైన నిర్ణయాత్మక కార్యాచరణ అత్యవసరం. ఆరోగ్య వ్యవస్థ గురించిన ఆలోచనలు, ఆచరణ అంతా ఎక్కడో దారితప్పిపోయిన స్థితి ఏర్పడింది. యూనివర్సల్ హెల్త్ కవరేజి విషయాన్ని పట్టించుకోకుండా ఎవరేమి చెప్పినా, చేసినా ఆశించిన ఫలితాలు రావటం అసాధ్యం.

ఆధునిక సమాజ అంతిమ లక్ష్యం అందరికీ ఆరోగ్యం. ఆరోగ్యమే దూరమైనప్పుడు ఆ ప్రజలు జీవించేహక్కుకు దూరమైనట్లే.

ఆరోగ్య సంరక్షణ అనేది చాలా ఖర్చుతో కూడుకున్నదిగా మారిపోయింది. దీనివల్ల మెజారిటీ ప్రజలు ఆరోగ్యాన్ని పొందలేకపోతున్న దుస్థితి ఉన్నది. సమాజంలోని మెజారిటీ ప్రజలు దిగువ మధ్యతరగతి, పేదలు, బాలికలు, స్త్రీలు, వెనుకబడిన నిమ్న జాతుల ప్రజానీకం ఆరోగ్యాన్ని పొందలేని స్థితిలో ఉన్నారు. నలభై నాలుగేండ్ల కిందటే ప్రజలందరికీ ఆరోగ్యమనే (యూనివర్సల్ హెల్త్‌కేర్) లక్ష్యాన్ని అల్మా ఆటా డిక్లరేషన్ ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య భద్రతలో భాగంగా ప్రజలందరికీ ఆరోగ్యం అనేది మానవహక్కు. ఇది ఏ రూపంలోనూ, ఏ విధంగానూ నిరాకరింపబడటానికి వీలులేదని చెప్పడం జరిగింది. డాక్టర్ అమిత్‌సేన్ గుప్త ప్రకారం.. యూనివర్సల్ హెల్త్‌కేర్ ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య పాలసీ పేర ప్రభుత్వాలే అతని ఆరోగ్యానికయ్యే ఖర్చు భరించాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవటం అనేదానికే ప్రాధాన్యం కాకుండా హెల్త్ కవరేజ్ అనేది ముఖ్యమైనది.

సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత దేశదేశాల్లో ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నది. ఆరోగ్యం అనేది తప్పనిసరిగా అందించాల్సిన బాధ్యతగా కాకుండా వ్యాపారంగా మారిపోయింది. పెట్టుబడి ఆరోగ్యాన్ని నిర్దేశిస్తున్నది. అభివృద్ధి చెందుతున్న వెనుకబడిన దేశాల్లో ప్రజారోగ్యం అనేది ప్రభుత్వాల బాధ్యతగా కాకుండా ప్రైవేటు పరమయ్యింది. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్యం గురించి ఆయా ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకుని ఎక్కువ నిధులు కేటాయించి ప్రజారోగ్యానికి పూచీపడాలి. అలా ప్రభుత్వాలు పూచీ పడినప్పుడే భారంగా మారిన ఆరోగ్య రక్షణ అనేది ప్రజలందరికీ అందుబాటులోకి వస్తుంది. ఐక్యరాజ్యసమితి కూడా ప్రజలందరి ఆరోగ్యానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలని తెలుపడం గమనార్హం.

ఆరోగ్యంపై ఐక్యరాజ్యసమితి అత్యున్నతస్థాయి సమావేశం కూడా ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించింది. ప్రపంచమంతా సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులేస్తూనే, ప్రజారోగ్యం విషయంలో మరింత శ్రద్ధ వహించాలని



పిలుపునిచ్చింది. దీనికి రాజకీయ పరమైన నిర్ణయాత్మక కార్యాచరణ అత్యవసరం. ఆరోగ్య ప్రపంచం గురించిన ఆలోచనలు, ఆచరణ అంతా ఎక్కడో దారితప్పిపోయిన స్థితి ఏర్పడింది. యూనివర్సల్ హెల్త్ కవరేజి విషయాన్ని పట్టించుకోకుండా ఎవరేమి చెప్పినా, చేసినా ఆశించిన ఫలితాలు రావటం అసాధ్యం. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా వలసలు, వాతావరణ మార్పులు సుస్థిరాభివృద్ధికి తీవ్ర విఘాతంగా మారుతున్నాయి.

ఐక్యరాజ్యసమితి పదే పదే చెప్పేదేమంటే.. ప్రభుత్వాలు ప్రజారోగ్యం గురించి నిర్దిష్ట ప్రణాళికాబద్ధమైన చర్యలతో ముందుకు పోవాలి. సమాజంలోని అట్టడుగు ప్రజలు కూడా నాణ్యమైన వైద్యాన్ని పొందగలిగి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి. ప్రైవేటు సంస్థల చేతుల్లో ఆరోగ్యం ఉన్నప్పుడు ప్రజలందరూ దాన్ని పొందటానికి అవకాశం ఉండదు. కుల, లింగ, ప్రాంత పరిమితి లేకుండా అందరూ అన్ని విధాలా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే పరిస్థితులు ప్రభుత్వాలు కల్పించాలి. కానీ ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజారోగ్యం గురించి ఎన్ని చెప్పినా ఆచరణలో విఫలమవుతున్న స్థితి తీవ్ర నిరాశ కలుగుతున్నది. ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై జీడీపీలో ఎక్కువశాతం కేటాయించాలి. భారత్‌లో ఇప్పుడు జీడీపీలో ఒక శాతం కన్నా ఎక్కువ నిధులు కేటాయిస్తున్న పరిస్థితి లేదు. కాబట్టి ప్రభుత్వాలు ప్రజారోగ్యం గురించి ఎక్కువ నిధులు కేటాయించాలి.

ప్రజారోగ్యం అనేది కేవలం మనుషుల ఆరోగ్య సమస్యగానే కాకుండా అదొక సామాజిక విషయంగా చూడాలి. ప్రజల జీవితాలు, ఆకాంక్షలతోనే ప్రజారోగ్యం ముడిపడి ఉంటుంది. అందరికీ ఆరోగ్యం సుసాధ్యం కావాలంటే ప్రజాస్వామిక వాతావరణం, సామాజిక సమస్యల పరిష్కారం దిశగా అడుగులు పడాలి. సమాజంలో వివక్ష, అణచివేతలకు గురవుతున్న ప్రజాసమూహాల ఆకాంక్షలను పరిగణలోకి తీసుకోవాలి. తద్వారా మాత్రమే ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చే చర్యలు అర్థవంతంగా ఉంటాయి. **(కర్టెసీ: నమస్తే తెలంగాణ)**







హైదరాబాద్ అంబర్‌పేటలో జరిగిన 'సోహం' లీడర్‌షిప్ కార్యక్రమంలో యువతతో
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్..








గత సంచిక తరువాయి

# అందరికీ ఆరోగ్యానికి
# ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం | అందుబాటు | అతి తక్కువ వ్యయం**

## జూలై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**



స్థానిక అవసరాలు, పరిస్థితులకనుగుణంగా దిగువ పద్ధతిలో నామమాత్రపు ఫీజుని ప్రతిపాదించటమైంది.

**(పట్టిక 4.12: ప్రాథమిక వైద్య సేవలకు నామమాత్రపు సహ చెల్లింపుకి ప్రతిపాదిత విధానం)**

సహ చెల్లింపే స్వల్పం కాబట్టి, ప్రజారోగ్య సేవలను అందుకోకుండా నామమాత్రపు సహ చెల్లింపు సాధారణంగా ప్రజలను నిరుత్సాహపరచదు. స్వల్ప, దీర్ఘకాలాల్లో నామమాత్రపు రుసుముని వసూలు చేయటం వల్ల వ్యవస్థకు కలిగే అపార లాభాలతో పోలిస్తే రోగులు భరించాల్సిన స్వల్ప మొత్తపు ఆర్థిక భారం బహు తక్కువ. భారతదేశంలో పేదల తలసరి వ్యయం రోజుకు రూ.80 అనుకుంటే, ఏడాదికి రెండుసార్లు మాత్రమే అవకాశమున్న రోగి వైద్య సంప్రదింపుకి రూ.25 తీసుకోవటం సేవల అందుబాటుకు అవరోధమవదు. ఒకవేళ, అందుబాటు, వ్యయం, నాణ్యతలో ఇంకో మార్గంగా లేదా చౌకగా ప్రయివేటు ప్రత్యామ్నాయం అందుబాటులో ఉంటే, అటువంటి వైద్యుల సేవల వైపు మొగ్గు పెరగటం వల్ల మొత్తంగా ఆరోగ్య వ్యవస్థకయితే నష్టం జరగదు.

అయితే, నిజమైన ప్రమాదం అధికారిక వైద్యుల స్థాయిలో లేదా వారి కంటే తక్కువగా ఫీజు తీసుకుంటూ అశాస్త్రీయంగా, నిర్లక్ష్యపూరితంగా వైద్యాన్ని చేసే అనధికార సేవలదారుల పట్ల ప్రజల్లో ఆదరణను అనుకోకుండా పెంచే అవకాశాన్ని కల్పించటంలో ఉంది. అటువంటి పరిణామం ఆరోగ్య వ్యవస్థకు హానికరం. కాబట్టే.. ఫీజు పద్ధతిని అవలంబించటం, ఆ ఫీజు మొత్తాన్ని స్థానిక అవసరాలు, పరిస్థితులను జాగ్రత్తగా బేరీజు వేసి నిర్ధారించటం! ఎటువంటి పరిస్థితుల్లోనూ, డబ్బులు లేకపోవటం వల్ల ఏ వ్యక్తికీ సరైన చికిత్స అందకపోవటం ఉండకూడదన్నది ప్రధాన సూత్రం. నిరుపేద వ్యక్తులందరూ ఎఫ్.పి నిర్ణయించిన ప్రకారం ఉచిత సేవల్ని పొందాలి.

### 4.2.2.11. జవాబుదారీతనం, పర్యవేక్షణ

జవాబుదారీతనం ఆరోగ్య వ్యవస్థలో ఎంతో కీలకమైన అంశం. అది లేకుండా మొత్తం నమూనా సామర్థ్యం ప్రమాదంలో పడుతుంది. సేవలకు రోగుల నుండి నామమాత్రపు సహ చెల్లింపు తీసుకోవటంతోపాటు ఎంపిక, పోటీ అంశాలు.. వ్యవస్థ రూపకల్పనలో అంతర్నిర్మితంగా ఉండే సమర్థవంతమైన ఏర్పాట్లతో జవాబుదారీతనాన్ని అందిస్తాయి. దీంతోపాటు, అధికారికంగా జవాబుదారీతనానికి హామీ ఇస్తూ అమలు చేసే పర్యవేక్షణ యంత్రాంగాలు అవసరం.

ఆరోగ్య సేవల జారీ, పర్యవేక్షణ బాధ్యత ప్రధానంగా రాష్ట్రాలపై ఉంటుంది. కాబట్టి, రాష్ట్రంలో ప్రభుత్వంలోని వివిధ స్థాయిలో జవాబుదారీతనం అమలుకు బలమైన సంస్థలు అవసరం. ఎఫ్.పి నేతృత్వంలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ కోసం, జవాబుదారీతనం చట్రంలోని మొదటి అంచెలో సి.హెచ్.సిలు ఉండాలి. ప్రస్తుతం దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 5649 సి.హెచ్.సిలు ఉన్నాయి. ప్రతి సి.హెచ్.సి, పైన చర్చించినట్లుగా సుమారుగా ఒకటి లేదా రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో (1,00,000 - 1,50,000 జనాభా కలిగిన) సమన్వయం చేసుకుంటుంది. స్థానిక పరిస్థితులు, విధులు నిర్వహిస్తున్న ఎఫ్.పిలను బట్టి, సి.హెచ్.సి స్థాయిలోని ప్రతి ప్రాంతీయ ఆరోగ్య బోర్డు 10-20 ఎఫ్.పిల పర్యవేక్షణకు బాధ్యత వహిస్తుంది. సి.హెచ్.సిలు.. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో తమ పరిధిలోని అన్ని రోగ నిర్ధారణ పరీక్షల ల్యాబొరేటరీలు, మందుల దుకాణాల పనితీరుని కూడా పర్యవేక్షిస్తాయి.

రెండో అంచె జవాబుదారీతనం జిల్లా స్థాయిలో ఉండాలి. ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల జిల్లా ఆరోగ్య బోర్డు (డి.హెచ్.బి)ని ఏర్పాటు చేసి పాలన, పర్యవేక్షణ బాధ్యతల్ని అప్పగించవచ్చు. డి.హెచ్.బి తన పాలనాధికారాలతో.. ఎఫ్.పిలు, డయాగ్నొస్టిక్ సేవలందించేవారు, ఔషధ పంపిణీ కేంద్రాలతో కాంట్రాక్టు కుదుర్చుకోవటానికి, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో వారి సేవలకు చెల్లింపులు చేయటానికి బాధ్యత వహిస్తుంది. పర్యవేక్షణ అథారిటీగా జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పనితీరును మొత్తంగా డి.హెచ్.బి పర్యవేక్షిస్తుంటుంది. జిల్లా స్థాయిలో ఎఫ్.హెచ్.ఎం.ఎ కింద సేకరించిన మొత్తం సమాచారంపై దానికి నియంత్రణ ఉంటుంది. ఎన్నికైన స్థానిక ప్రభుత్వం, జిల్లా వైద్య, ఆరోగ్య విభాగం, ఆరోగ్య రంగంలో పేరొందిన స్వచ్ఛంద సంస్థలు, పైన పేర్కొన్న మొదటి అంచెలోని సి.హెచ్.సి స్థాయి యంత్రాంగం నుండి ప్రతినిధులతో డి.హెచ్.బిని ఏర్పాటు చేయవచ్చు.

వ్యవస్థ మూడో అంచె రాష్ట్ర స్థాయిలో ఉండాలి. దేశంలో ఆరోగ్య సేవల జారీకి అది కేంద్ర బిందువు. ఎఫ్.పి నేతృత్వంలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను అమల్లోకి తేవటానికి బాధ్యత వహించే ఒక రాష్ట్ర ఆరోగ్య బోర్డు (ఎస్.హెచ్.బి)ని ఏర్పాటు చేయవచ్చు. అనుసరించాల్సిన పద్ధతులు, నియమాలకరూపకల్పనకు కూడా ఎస్.హెచ్.బి బాధ్యత తీసుకుంటుంది. దీంతోపాటు, డి.హెచ్.బిలకు వనరుల్ని కేటాయిస్తుంది, వాటి వినియోగం జమాఖర్చుల్ని తనిఖీ చేసే అధికారాన్ని ఎస్.హెచ్.బిలు కలిగివుంటాయి. మొత్తంగా డి.హెచ్.బిల పనితీరును అవి పర్యవేక్షిస్తాయి. రాష్ట్ర స్థాయిలో ఆరోగ్య వ్యవస్థపై డేటాకు సంబంధించి మొత్తంగా పర్యవేక్షణ, ఏ విధమైన అక్రమాలు చోటుచేసుకున్నా గుర్తించటం, తద్వారా అక్రమ కార్యకలాపాల్ని నిరోధించటానికి తోడ్పాటునందించటంలో ఎస్.హెచ్.బి కీలక పాత్ర పోషిస్తుంది. ఎస్.హెచ్.బి కూర్పులో ప్రభుత్వ ప్రతినిధులు, వైద్య విద్య, ఆస్పత్రి సంరక్షణ, ప్రాథమిక ఆరోగ్యం, ప్రజారోగ్యాలకు బాధ్యత వహించే అన్ని విభాగాల అధిపతులు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ఆరోగ్య రంగ నిపుణులు, ఆరోగ్య రంగంలో పేరొందిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఔషధ, డయాగ్నొస్టిక్ పరిశ్రమల నుండి ప్రతినిధులు కూడా ఉండాలి.

వివిధ పోకడల్ని గుర్తించటంలో, అత్యుత్తమ విధానాల్ని అనుసరించటంలో, వ్యవస్థాగత పొరపాట్లను సరిదిద్దుకోవటంలో రాష్ట్ర, స్థానిక అధికారులకు ఫెడరల్ ఆరోగ్య పర్యవేక్షణ ఏజెన్సీ జాతీయ స్థాయిలో మార్గదర్శకత్వం వహిస్తుంటుంది.

పి.ఎం-జె.ఎ.వై పథకం కింద ఆరోగ్య సేవల జారీ అమలు, పర్యవేక్షణకు ఒక బహుళ అంచెల వ్యవస్థను నిర్మించాలని సంకల్పించారు. పత్రంలోని ప్రతిపాదిత ఆరోగ్య నమూనాను ప్రస్తుత పి.ఎం-జె.ఎ.వై వ్యవస్థతో తగురీతిలో అనుసంధానించవచ్చు.

**4.2.3. దశలవారీ, ధరల అంచనాలు**

**4.2.3.1. మూడేళ్లలో దశలవారీ అమలు**

సాధారణంగా ఏ విధానానికి సంబంధించిన సిఫారసునయినా, అందులోనూ ఎక్కువమందిని ప్రభావితం చేస్తూ సాధారణ సమాజంపై విస్తృతస్థాయి ప్రభావం చూపే ఆరోగ్య సంరక్షణ విధానాన్ని.. ఎంతో జాగ్రత్తగా అమలు చేయాలి. ఒక ప్రాంతం నిర్దిష్ట అవసరాలు, ప్రత్యేక లక్షణాలను పరిగణలోకి తీసుకోవాలి. క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా స్థానిక వినూత్న పరిష్కారాలకి అవకాశం ఉండాలి. దీంతోపాటు, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ స్థితిలో దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య పెద్దఎత్తున అంతరాలు ఉన్నాయి కాబట్టి.. ప్రతిపాదిత నమూనాలోని ప్రతి చిన్న అంశమూ ప్రతి రాష్ట్రం తన పరిస్థి తులకు తగ్గట్లు అమలు చేసుకునేందుకు అనువుగా ఉండాలి.

కాబట్టి, నమూనాను మూడేళ్ల కాలవ్యవధిలో అమలు చేయవచ్చు.

**సాధించాల్సిన కీలక కార్యాలు:**

- దేశవ్యాప్తంగా 10,000 సెంటర్లలో (1,00,000-1,50,000 జనాభా) ఎఫ్.పి నెట్‌వర్క్ ఏర్పాటు. అటువంటి ప్రతి సెంటర్‌లో స్థానిక అవసరాలను బట్టి 8-10 ఎఫ్.పిలు ఉంటారు.
- కార్యక్రమంలో పాల్గొనాలనుకున్న డాక్టర్లందరికీ ఎఫ్.పిలుగా ఫ్యామిలీ ఆరోగ్య సేవల్లో ఒక నెల వ్యవధి పాఠ్య విభాగాలతో శిక్షణనివ్వాలి.
- ప్రతి సెంటర్‌లో ప్రయివేటు ఆధ్వర్యంలో ఔషధ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలి. అది ప్రభుత్వం సేకరించిన మందుల్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఆ సెంటర్‌కు చెందిన ఎఫ్.పి క్లినిక్‌ల రోగులకు పంపిణీ చేస్తుంది.
- ఎఫ్.పి క్లినిక్‌ల రోగులకు సాధారణ రోగ నిర్ధారణ పరీక్షలకు ప్రతి సెంటర్‌లో ఒక డయాగ్నొస్టిక్ ల్యాబొరేటరీని పి.పి.పి నమూనాలో ఏర్పాటు చేయాలి.
- రెండో స్థాయి (లెవెల్ 2) రోగ నిర్ధారణ పరీక్షల నిర్వహణకు మొత్తం రాష్ట్రానికి డయాగ్నొస్టిక్ సేవలను ఔట్‌సోర్స్ చేయాలి.
- రోగుల ఆరోగ్య రికార్డులను డిజిటలీకరించే ప్రక్రియను ప్రారంభించాలి.
- పద్ధతులు, నిబంధనలు, నిర్వహణ నియమావళి, నిధుల వినియోగ పద్ధతులు, జవాబుదారీ వ్యవస్థలను నెలకొల్పటం.

**4.2.3.2. మూడేళ్ల చివరి నాటికి ప్రభుత్వానికి అయ్యే వార్షిక వ్యయం అంచనాలు**

ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల్లో ప్రజలు వైద్యం చేయించుకోవటం తగ్గిపోయి కేవలం 25 శాతం దాకా మాత్రమే ఉన్న నేపథ్యంలో.. ఒక్కసారి ఎఫ్.పి వ్యవస్థను పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చి, ప్రభుత్వ నిధులతో నడిచే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించినప్పుడు ప్రభుత్వ సేవల వినియోగం కాలక్రమంలో గణనీయంగా మెరుగుపడుతుంది. కాబట్టి, సేవల్ని మూడేళ్లలో పూర్తిస్థాయిలో అమలు చేశాక ప్రభుత్వ ఖజానాకి ఎంత ఖర్చవుతుందో వార్షిక ప్రాతిపదికన అంచనాల్ని రూపొందించటమైంది. ఒక్కో వ్యక్తికి ఏడాదికి 1.5 ఔట్‌పేషెంట్ సంప్రదింపులు (ప్రస్తుతం అది 0.6గా ఉంది) ఉంటాయని, ఒక్కసారి సేవలు అందుబాటులోకి వచ్చాక సుమారు 70 శాతం జనాభా, లేదా 100 కోట్ల మంది ప్రజలు వినియోగించుకుంటారని మేము అంచనా వేస్తున్నాము.

ప్రజల్లో 70 శాతం మంది ఎఫ్.పిల సేవల్ని వినియోగించుకుంటారని అంచనా. ఆ ప్రాతిపదికన, 140 కోట్ల జనాభా, ప్రతి వ్యక్తికి ప్రతి ఏటా 1.5 సంప్రదింపుల శాతంతో, ప్రతి సంవత్సరం 150 కోట్ల మంది ఔట్‌పేషెంట్లు ప్రాథమిక వైద్య సేవల్ని వినియోగించుకుంటారని అంచనా. ఆ రకమైన సేవకి ప్రభుత్వ ఖజానాకయ్యే వ్యయంలో.. పేదలుకాని విభాగంలోకి వచ్చే 90 శాతం మంది ఔట్‌పేషెంట్ల నుండి సహ చెల్లింపుల్ని మినహాయించుకున్నాక ఎఫ్.పి సంప్రదింపులు, మందుల పంపిణీ, డయాగ్నొస్టిక్‌లకు అయ్యే ఖర్చు భాగంగా ఉంటాయి.

**4.2.3.2.1. ఎఫ్.పి సంప్రదింపులకి అయ్యే ఖర్చు**

**(పట్టిక 4.13ఎ: ఎఫ్.పి సంప్రదింపుల వ్యయం)**

**4.2.3.2.2. ఔషధాల పంపిణీ వ్యయం**

**(పట్టిక 4.13బి: ప్రాథమిక ఆరోగ్య వ్యయ అంచనాలు - ఔషధాల పంపిణీ వ్యయం)**

**4.2.3.2.3. రోగ నిర్ధారణ పరీక్షలకి ఖర్చు**

**(పట్టిక 4.13సి: డయాగ్నొస్టిక్‌లకి అయ్యే ఖర్చు)**

**4.2.3.2.4. ప్రాథమిక ఆరోగ్యంపై ఖజానాకి అయ్యే మొత్తం ఖర్చు**

**(పట్టిక 4.13డి: ఖజానాకయ్యే మొత్తం ఖర్చు)**

సుమారు 1,00,000 మంది ఎఫ్.పిలు దేశవ్యాప్తంగా 10,000 సెంటర్లలో పోటీ ఆధారిత సేవలను అందించటాన్ని, సేవలకు సహ చెల్లింపుల నుండి ఆదాయాన్ని ఈ నమూనా లక్షిస్తోంది. ప్రయివేటు రంగంలో 10,000 క్లినికల్, డయాగ్నొస్టిక్ ల్యాబొరేటరీలు ఉంటాయి. ప్రతి సెంటర్‌కీ ఒకటి చొప్పున ఔట్‌పేషెంట్లకు సాధారణంగా అవసరమైన డయాగ్నొస్టిక్ సేవలను ఇవి అందిస్తాయి. మరింత అధునాతన

పరీక్షలకు, లెవెల్ 2 డయాగ్నొస్టిక్ సేవలను ఔట్‌సోర్స్ చేస్తారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న ల్యాబొరేటరీలకు శాంపిళ్లను రవాణా చేస్తారు. ప్రతి సెంటర్‌కీ ఒకటి చొప్పున 10,000 చిల్లర మందుల దుకాణాలు ఉంటాయి. ఇవి ప్రతి రాష్ట్రంలో కేంద్రీకృతంగా సేకరించిన ఔషధాల్ని, వైద్య వినియోగ వస్తువుల్ని (కన్స్యూమబుల్స్) ఎఫ్.పి వ్యవస్థ సేవలను అందుకునే రోగులకు పంపిణీ చేస్తాయి. రోగులకు ప్రశ్నించే అధికారాన్ని అందించేందుకు, నాణ్యత, జవాబుదారీతనాల్ని పెంపొందించేందుకు నామమాత్రపు సహ చెల్లింపులు ఉంటాయి. అటువంటి వ్యవస్థను మూడేళ్లలో దశలవారీగా పూర్తిస్థాయిలో అమల్లోకి తేవచ్చు. ప్రస్తుతమున్న వార్షిక తలసరి 0.5 రేటును పెంచుతూ ఈ వ్యవస్థ ఒక ఏడాదిలో ఒక్కో వ్యక్తికి 1.5 ఔట్‌పేషెంట్ సంప్రదింపుల్ని చేయగలుగుతుందని అంచనా. దాదాపు 100 కోట్ల ప్రజల ప్రాథమిక ఆరోగ్య అవసరాలన్నిటినీ ఇది తీరుస్తుంది. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలోని ఔట్‌పేషెంట్ సందర్శనలు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందులపై చిన్నపాటి సహ చెల్లింపులు మినహా జేబుల్లో నుంచి చేసే వ్యయం మొత్తాన్నీ తొలగిస్తుంది. నిరుపేద రోగులకు నామమాత్రపు సహ చెల్లింపుల నుండి కూడా మినహాయింపు ఉంటుంది. డబ్బు లేదన్న కారణంగా ఏ ఒక్క రోగికీ ఆరోగ్య సేవల్ని తిరస్కరించటం ఉండదు. దాదాపు 40 కోట్ల మంది ప్రజలు, లేదా దేశ జనాభాలో 30 శాతం మంది, ప్రయివేటు సేవల్ని పొందగల అవకాశాల్ని కలిగి ఉన్నారని అంచనా. వీరు ప్రయివేటు సంరక్షణ మీద ఆధారపడటాన్ని కొనసాగిస్తారు. కానీ సూత్రప్రాయంగా ఉచిత, నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్యం అందరు ప్రజలకూ అందుబాటులో ఉంటుంది. దీనివల్ల, విషయ పరిజ్ఞానమున్న, ప్రశ్నించ గలిగిన మధ్యాదాయ వర్గాలు ఈ సదుపాయాల్ని వినియోగించుకుని నాణ్యమైన సేవల్ని అందించేలా వ్యవస్థపై ఒత్తిడి కొనసాగిస్తారు. అయిదేళ్ల తర్వాత, డేటా, అనుభవం, ప్రజల నుండి డిమాండ్ ఆధారంగా సేవల ప్రాసంగికతను సమీక్షిస్తారు. అవసరం అనుకుంటే మరిన్ని సెంటర్లలో ఇంకా ఎఫ్.పిలను వ్యవస్థ జాబితాలో చేర్చవచ్చు.

## అధ్యాయం 5

## ద్వితీయ స్థాయి వైద్య సేవలు

'ఆస్పత్రి మరియు కమ్యూనిటీ సేవలు' అని కొన్ని సందర్భాల్లో పిలిచే ద్వితీయ స్థాయి వైద్యంలో.. అన్ని ఆస్పత్రి సేవలు, శిశు జననాలు, సిజేరియన్ శస్త్ర చికిత్సలు సహా ప్రసూతి సేవలు, పొత్తికడుపు లేదా కంటి శుక్లాల ఆపరేషన్లు వంటి ప్రణాళికాయుతంగా ఎంపిక చేసుకున్న సేవలు లేదా తక్షణ, అత్యవసర సేవలు, సాధారణ స్థాయి ఎముకల పగుళ్లు, విరగటం, గాయాలు సహా ట్రౌమా చికిత్స భాగంగా ఉంటాయి. ఈ స్థాయి ఆస్పత్రి సేవల్లో సాపేక్షంగా తక్కువ ఖర్చయ్యే సాధారణ చికిత్సలు ఉంటాయి. పద్ధతి ప్రకారం అయితే, ప్రాథమిక వైద్యుడు రోగులను స్పెషలిస్టుల వద్దకు సిఫార్సు చేస్తారు. రెండో దశ చికిత్సలో ఒక ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే యంత్రం, ఇతర మౌలిక రోగ నిర్ధారణ పరీక్ష ఏర్పాట్లు, ఆక్సిజన్ నిర్వహణ సదుపాయాలు, ఇంకా ఇన్‌పేషెంట్, ఆపరేషన్ అనంతర వైద్య సేవలకు కావలసిన అన్ని సౌకర్యాలూ ఉంటాయి.

తృతీయ స్థాయి వైద్యంలో ఆస్పత్రిలోనే అత్యున్నత స్థాయి ప్రత్యేకీకరించిన చికిత్స అవసరమవుతుంది. అత్యంత ఖరీదైన పరికరాలు, అత్యున్నత స్థాయి నైపుణ్యం అవసరమవుతాయి. తృతీయ స్థాయి వైద్యం సంక్లిష్టమైన బహుళ స్పెషాలిటీ సమస్యలు, అధునాతన డయాగ్నొస్టిక్‌లు, కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్స, మూత్రపిండాల వైఫల్యం, సంక్లిష్ట అత్యవసర చికిత్స, తీవ్రస్థాయి ప్రమాదాలు, ట్రౌమా, క్లిష్టమైన ఎముకలు, కీళ్లు, వెన్నెముక శస్త్ర చికిత్సలు, మోకాలు లేదా తుంటి మార్పిడి, మూత్రపిండ మార్పిడి, డయాలసిస్, కెమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ సర్జరీ వగైరా అత్యంత నిపుణత అవసరమైన చికిత్సలతో కూడి ఉంటుంది.

ద్వితీయ, తృతీయ స్థాయి వైద్య సేవల వల్ల పేదలపై ఆర్థిక భారాన్ని.. ఉమ్మడి నష్ట ప్రమాద భర్తీ ఏర్పాటు (రిస్క్ పూలింగ్), పి.పి.పి సహా ఏక చెల్లింపుదారు (సింగిల్-పేయర్) ఇన్సూరెన్స్ ఆధారిత పథకాల ద్వారా తగ్గించేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలు ప్రయత్నాల్ని ప్రారంభించాయి. యూనియన్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక జాతీయ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పి.ఎం.జె.ఎ.వై) సెప్టెంబర్ 2018లో ప్రారంభమైంది. 'తీవ్ర అనారోగ్యాలకయ్యే వ్యయం నుండి ఆర్థిక రక్షణ, అందరికీ చౌకయిన, నాణ్యమైన ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవటం' ఈ కార్యక్రమ లక్ష్యం.

### 5.1. ఆయుష్మాన్ భారత్ - పి.ఎం.జె.ఎ.వై

ప్రపంచంలోనే అతి పెద్ద ఏక చెల్లింపుదారు (సింగిల్-పేయర్) ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్ – పి.ఎం.జె.ఎ.వై.. ప్రస్తుతం ప్రతి కుటుంబానికీ రూ.5,00,000 వరకు ఆర్థిక కవరేజీని అందిస్తోంది. ఇది కుటుంబంలో అందరికీ వర్తించే ఫ్లోటర్ ప్రాతిపదికన భారతదేశ జనాభాలో దిగువస్థాయిలో ఉన్న 40 శాతం జనాభాకి (10.74 కోట్ల కుటుంబాలు) కొన్ని ద్వితీయ, తృతీయ ఆరోగ్య సేవలను అధీకృత జాబితాలో నమోదైన ప్రభుత్వ, ప్రయివేటు ఆరోగ్య సదుపాయాల్లో ఉచితంగా అందిస్తోంది. మొదటి సంవత్సరం కార్యక్రమం 24 స్పెషాలిటీల పరిధిలో 1592 చికిత్సలను కవర్ చేసింది. 2019-20లో వర్తింపును 1592 చికిత్సలకు విస్తరించారు. ఈ కార్యక్రమం కింద మూడు రోజులపాటు ముందస్తు ఆస్పత్రి సేవలకు, 15 రోజుల ఆస్పత్రి చికిత్సానంతర వైద్య ఖర్చులకు చెల్లింపు ఉంటుంది. ఇందులో మందులు, చికిత్సానంతర వైద్య సంప్రదింపులు, రోగ నిర్ధారణ పరీక్షలు భాగంగా ఉంటాయి.

(ఇంకా ఉంది...)











## ‘యోగా’ని ఆరోగ్య వ్యవస్థతో అనుసంధానం చేయాలి: జేపీ



అమెరికాలోలా భారీగా డబ్బు ఖర్చు చేస్తే ఆరోగ్యం సమకూరుతుందనే భ్రమల్ని వీడి.. మనకున్న యోగా వంటి సంప్రదాయాల్ని, మానవ వనరులు, చౌక ఔషధాలు వంటి ఇతర బలాల్ని ఉపయోగించుకుంటే జాతీయ ఆదాయంలో అదనంగా కేవలం 0.4% కేటాయింపుతో భారత్‌లో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించవచ్చని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. ఆయుర్వేదంలో ప్రాచీన కాలంలో సిఫార్సు చేసిన ఔషధాల వల్ల కాలేయ సమస్యలు వంటి కొన్ని దుష్పరిణామాలు తలెత్తుతున్నాయని ఇటీవలి పరిశోధనల్లో వెల్లడవుతోందని, కానీ యోగా ఎటువంటి దుష్పరిణామాలూ లేకుండా మేలు చేస్తుందన్నారు. పైగా రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దే చేయవచ్చన్నారు. మన దేశంలో ఒకప్పుడు ఆహారానికి కొరత ఉండటం వల్ల అవకాశమున్నప్పుడు ఎక్కువ తినటం, ఎంత ఎక్కువ తింటే అంత ఎక్కువ బలం ఆరోగ్యం అని అపోహ పడటం ఇంకా కొనసాగుతున్నాయని.. యోగాతోపాటు పోషకాలున్న మితాహారం తీసుకుంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటే స్థూలకాయం సహా చాలా ఆరోగ్య సమస్యల్ని నివారించవచ్చన్నారు.

## 108కి జేపీ కృషే కారణం

ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్న 108 అంబులెన్స్ సేవలు రూపుదిద్దుకోవటానికి, కొనసాగటానికి జయప్రకాష్ నారాయణ్ పట్టువిడవకుండా చేసిన కృషే ప్రధాన కారణమని 108 ఎమర్జెన్సీ సేవల వ్యవస్థాపక సీఈఓ వెంకట్ చెంగవల్లి తెలిపారు. తెలుగునాట 108 సేవలు విజయవంతం కావటంతో మిగిలిన రాష్ట్రాలు అనుకరించాయన్నారు. యోగా ప్రదర్శించిన విద్యార్థులు, యువతకు మిగతా అతిథులతో కలిసి జేపీ ప్రశంసాపత్రాల్ని అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, డాక్టర్ వీఎస్ రామచంద్ర, డాక్టర్ తుషార తదితరులు పాల్గొన్నారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th July, 2022 Posting Date 15 &16th of every month




## అసెంబ్లీ నియోజకవర్గానికి 2 ఫ్యామిలీ డాక్టర్ సెంటర్లతో ఆరోగ్య రంగ రూపురేఖలే మారిపోతాయి: జేపీ

పేదరిక నిర్మూలనకు, అందరికీ ఎదిగే అవకాశాలకు ప్రజలకు జేబుఖర్చులేని నాణ్యమైన ఆరోగ్యం అందించటం కీలకమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రభుత్వ ఖజానాపై అతి తక్కువ భారంతో ఉచిత, నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే అవకాశాలు భారత్‌కి ఉన్నాయని, సంకల్పం ఉండటమే ముఖ్యమని అన్నారు. మన ఆరోగ్య వ్యవస్థ సరిగా ఉంటే, కొవిడ్ కాలంలోనూ ఎన్నో అకాల మరణాల్ని నివారించగలిగేవారమన్నారు. ప్రజలకు ఖర్చులేని ఆరోగ్యం అందించేందుకు ప్రాథమిక స్థాయిలో ఏర్పాట్లు కీలకమని, అందుకే ప్రతి ఇంటికీ ఒక ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్యాన్ని అందించే వ్యవస్థను లోక్‌సత్తా ప్రతిపాదిస్తోందన్నారు. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానం సంక్షిప్త వివరాలతో కూడిన కరపుస్తకాన్ని రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఉద్యమ సంస్థ అధ్యక్షుడు మాచిరాజు ఉప్పలపాటి, ఇతర నేతలతో కలిసి ఆయన విడుదల చేశారు.

ఆరోగ్య రంగంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని ప్రయత్నాలు చేస్తున్నా, ప్రతి గ్రామంలో క్లినిక్, వైద్యుడు అంటే ఆచరణలో జరిగే పనులు కావని జేపీ అన్నారు. ప్రభుత్వం డబ్బు ఖర్చు చేయటమే కాకుండా సరైన రీతిలో ఖర్చు చేస్తేనే ఫలితాలు వస్తాయని అన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు ఫ్యామిలీ డాక్టర్ సెంటర్లను గ్రామాలకు కేంద్రంగా ఉండే చిన్న పట్టణాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో సెంటర్‌లో 10-15 మంది ఫ్యామిలీ డాక్టర్లు ఉంటారని, వీరిలో తమకు మెరుగైన సేవలందిస్తారనుకున్నవారిని ఎంచుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉంటుందన్నారు. పైస్థాయి ఆస్పత్రి సేవలకు కూడా ఈ ఫ్యామిలీ డాక్టర్లే సిఫార్సు చేసి సమన్వయం చేస్తారన్నారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ, ఉచిత డయాగ్నొస్టిక్‌ల వంటి ఏర్పాట్లతో దేశానికి మార్గం చూపుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న ఆరోగ్య విధానం అమలుకు చొరవ చూపాలన్నారు. సమగ్ర ఆరోగ్య విధానం పుస్తకాన్ని త్వరలో విజయవాడలో ఆవిష్కరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి అన్ని వివరాలనూ తెలియచేస్తామని, పార్టీలు, మీడియా, సమాజం అందరూ పక్షపాతాలకతీతంగా ఈ విధానం అమలుకు కలిసిరావాలని జేపీ విజ్ఞప్తి చేశారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జరిగిన వైద్య దినోత్సవంలో మాట్లాడుతూ, మనకు వైద్యులు పుష్కలంగా ఉన్నా వారి సేవలను సద్వినియోగం చేసుకోకుండా వైద్యుల కొరత ఉన్నట్లు కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు పేరుతో కాలయాపన చేస్తున్నారని జేపీ అన్నారు. వైద్య విద్య నాణ్యతను పెంచాలని, ప్రయివేటు రంగాన్ని కొనసాగిస్తూనే ప్రజలందరికీ ఉచిత, నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గురునాథ్, డీన్ డాక్టర్ వై.వి శర్మ, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌సీ మూర్తి, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**